ఈశాన్యంలో పోలింగ్ డే

- నేడు మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలు
- బరిలో 552 మంది.. 34 లక్షల మందికి పైగా ఓటర్లు
- 2న త్రిపురతోపాటు ఈ రెండు రాష్ట్రాల ఫలితాలు

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 206 | విజయవాడ, సోమవారం 27 ఫిబ్రవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 27 February 2023 | Rs

ఆసీస్ సిక్సర్



- ఐసీసీ టీ20 ప్రపంచకప్ సొంతం
- ఫైనల్లో దక్షిణాఫ్రికాకు భంగపాటు

లోపలి పేజీలో..

సిసోడియా అరెస్టు

- సిబిఐ కార్యాలయం వద్ద ఆప్ నేతల ఆందోళన, అరెస్టు
- అరెస్టు దుష్టరాజకీయం : కేజ్రీవాల్



సిసోడియాను అరెస్టు చేస్తున్న పోలీసులు

న్యూఢిల్లీ : మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియాను సిబిఐ అధికారులు అరెస్టు చేశారు. ఆదివారం ఉదయం 11.12 గంటలకు విచారణకు హాజరైన ఆయనను ఎనిమిది గంటలపాటు సిబిఐ అవినీతి నిరోధకశాఖ అధికారులు ప్రశ్నించారు. అనంతరం అదుపులోకి తీసుకుని, అరెస్టు చేసినట్లు సిబిఐ ప్రకటించింది. ఈ నేపథ్యంలో సిబిఐ కేంద్ర కార్యాలయ పరిసరాల్లో ఢిల్లీ పోలీసులు 144 సెక్షన్ విధించారు. విచారణ సమయంలో మద్యం పాలసీ గురించి వివిధ కోణాల్లో సిసోడియాను సిబిఐ అధికారులు ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న దినేష్ అరోడా, ఇతర నిందితులతో గల సంబంధాలపై ఆరా తీశారు. వివిధ సందర్భాల్లో చేసిన ఫోన్ కాల్స్ గురించి అడిగినట్లు తెలుస్తోంది. మనీష్ సిసోడియా సమాధానాలు సంతృప్తికరంగా లేవని, ఆయన విచారణకు సహకరించడం లేదని, కీలక అంశాల్లో ఆయన చెప్పిన సమాధానాలతో పొంతన కుదరకపోవడంతో అరెస్టు చేశామని సిబిఐ అధికారులు తెలిపారు. సిసోడియా నుంచి కీలక సమాచారం రాబట్టాలంటే కస్టోడియల్ విచారణ అవసరమని అన్నారు. ఆయనను సోమవారం కోర్టులో ప్రవేశపెట్టనున్నారు.

మనీష్ సిసోడియా అరెస్టు దుష్టరాజకీయం : కేజ్రీవాల్

మనీష్ సిసోడియా అరెస్టు దుష్ట రాజకీయమని ఢిల్లీ సిఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. 'మనీష్ సిసోడియా అమాయకుడు. ఆయనను అరెస్టు చేయడం దుష్టరాజకీయం. ఈ అరెస్టుతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అందరూ గమనిస్తున్నారు. ప్రజలు అన్నీ అర్థం చేసుకుంటున్నారు. దీనిపై ప్రజలే స్పందిస్తారు' అని ట్వీట్ చేశారు. ఇలాంటి చర్యలు తమ పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు.

భగత్‌సింగ్‌ను అనుసరించే వ్యక్తిని : సిసోడియా

సిబిఐ విచారణకు ముందు సిసోడియా రాజ్‌ఘాట్‌లోని గాంధీ సమాధి వద్దకు వెళ్లి నివాళు లర్పించారు. అంతకుముందు ఆయన చేసిన ట్వీట్ చర్చనీయాంశమైంది. 'నేను ఈ రోజు సిబిఐ విచారణకు మరోసారి హాజరవుతున్నా. విచారణకు పూర్తిగా సహకరిస్తా. మరికొన్ని నెలలు జైలులోనే ఉండాల్సి వచ్చినా.. లెక్కచేయను. నేను భగత్‌సింగ్‌ను అనుసరించే వ్యక్తిని' అని పేర్కొన్నారు. ఈ కేసులో సిసోడియాను సిబిఐ గత ఏడాది అక్టోబర్ 17న కూడా సిబిఐ విచారించింది.

సిబిఐ కార్యాలయం వద్ద ఆప్ ఆందోళన

సిసోడియా అరెస్టును నిరసిస్తూ సిబిఐ ప్రధాన కార్యాలయం వద్ద ఆప్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. రాజ్యసభ ఎంపి సంజయ్‌సింగ్, మంత్రి గోపాల్‌రాయ్, ముగ్గురు ఎమ్మెల్యేలు, మహిళలుసహా 50 మంది ఆప్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సిబిఐ కార్యాలయం వద్ద

మిగతా 2లో

పాత పెన్షన్, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం

దేశవ్యాప్త ఉద్యమం

దశలవారి పోరాటానికి ఉద్యోగులకు ఎఐఎస్‌జిఇఎఫ్, సిసిజిఇడబ్ల్యు సదస్సు పిలుపు

- మార్చి 26న విశాఖలో బహిరంగసభ
- నవంబరు 3న ఛలో ఢిల్లీ



సదస్సులో అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాత పెన్షన్ విధాన సాధన, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణే లక్ష్యంగా దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంటు ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎఐఎస్‌జిఇఎఫ్), కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల సమాఖ్య (సిసిజిఇడబ్ల్యు)లు పిలుపునిచ్చాయి. ఆదివారం నాడు విజయవాడలోని ఎంబివికెలో ఆ సంస్థల ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న ఆ సంఘాల నాయకులు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. నేషనల్ పైప్ లైన్ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడాన్ని మానుకోవాలని కోరారు. ఈ లక్ష్యాల సాధన కోసం దశలవారీగా పోరాటాన్ని ఉధృతం చేయనున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా విస్తృత ప్రచారం, రాష్ట్రాల వారీ సదస్సులు, సభలతో పాటు నవంబర్ మూడవ తేదిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 26న విశాఖలో బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎఐఎస్‌జిఇఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు, ఎపిఎన్‌జిఓ సంఘం అధ్యక్షులు బండి శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎఐఎస్‌జిఇఎఫ్ ఛైర్మన్ సుభాష్ లాంబా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ఉద్యోగుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు జిల్లా తాలుకా , మండల కేంద్రాల్లో సదస్సులు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో 100 బస్‌స్టాండ్‌లను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిలు ఒక సారి గెలిస్తేనే వారికి పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వం 25,30 ఏళ్లు సర్వీస్ చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ హక్కును ఎలా తీసి వేస్తుందని ప్రశ్నించారు. దీనికోసం మార్చి 14న దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. సంఘ జనరల్ సెక్రటరీ ఎ. శ్రీకుమార్ మాట్లాడుతూ నవంబరు 3న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. డిసెంబరు 8న న్యూఢిల్లీలో జరిగిన జాయింట్ నేషనల్ కన్వెన్షన్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పార్లమెంటు వద్ద ధర్నా, బైక్ ర్యాలీలు, పాఠశాలల వద్ద ప్రచారం వంటి దశల వారి కార్యక్రమం తరువాత నవంబర్‌లో చలో ఢిల్లీ నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, సంస్థలు అన్ని కలిసి పోరాటం చేయాలన్నారు. కాన్ఫడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంటు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ (సిసిజిఇడబ్ల్యు) ఎపి, అండ్ టిఎస్ నాయకులు ఎ. అజీజ్ మాట్లాడుతూ ఏడు డిమాండ్లపై కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మీద వత్తిడి పెంచుతామని, అనివార్యమైతే సమ్మెకు సైతం వెనుకాడమని అన్నారు. ఎఐఎస్‌జిఇఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించే వరకు తమ పోరాటం సాగుతుందన్నారు. ఎఐఎస్‌జిఇఎఫ్ ఎన్‌సిసి మెంబరు శాంతిశ్రీ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిసిజిఇడబ్ల్యు ఎపి, టిఎస్ అధ్యక్షులు వి.నాగేశ్వరరావు, ఎపి ఎన్‌జిఓ అసోసియేషన్ కెవి శివారెడ్డి, ఎపి జెఎసి సెక్రటరీ జనరల్ హృదయరాజు, ఎం .రాజ్యలక్ష్మీ, ఎపి ఎన్‌జిఓ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ పురుషోత్తమనాయుడు, ఎస్ఎఫ్‌పిఇ కన్వీనరు బి.శ్రీధర్‌బాబు, తదితరులు ప్రసంగించారు.

చెరువులో పడవ బోల్తా

- ఆరుగురు యువకుల గల్లంతు

లోపలి పేజీలో..

మార్చి 26 నుంచి షిర్డీకి విమాన సర్వీసులు

వారిద్దరూ ఒకటే!

- అదానీ, మోడీలపై రాహుల్
- నిజం బయటకు వచ్చేంతవరకు ప్రశ్నిస్తూ ఉంటా



కాంగ్రెస్ ప్లీనరీకి హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే తదితరులు

రాయిపూర్ : అదానీ, మోడీలు వేరు, వేరు కాదని వారిద్దరు ఒకటేనని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. కాంగ్రెస్ పిన్లరీ సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీకి, అదానీకి మధ్య ఉన్న సంబంధం ఏమిటని పార్లమెంటులో తాను ప్రశ్నించినప్పుడు ప్రభుత్వం జవాబియ్యలేదని చెప్పారు.

దేశానికి వ్యతిరేకంగా అదానీ పనిచేస్తున్నారన్నారు. అదానీ గురించి నిజాలు బయటకు వచ్చే వరకూ పార్లమెంట్‌లో తాము ప్రశ్నిస్తూనే ఉంటామని ఆయన చెప్పారు. దేశ సంపదను లూటీ చేసిన ఒక కంపెనీకి వ్యతిరేకంగా స్వాతంత్ర పోరాటం జరిగిందని, ఇప్పుడు మళ్లీ అదే చరిత్ర పునరావృతం కానుందని అన్నారు. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు నిర్వహించిన భారత్ జోడో యాత్రను ఒక తపస్సుగా ఆయన అభివర్ణించారు. దానిని ముందుకు తీసుకువేళ్లడానికి ప్రణాళికను సిద్ధం చేయాలని కాంగ్రెస్ నేతలకు ఆయన సూచించారు.

త్వరతో జోడో 2.0 : జైరామ్ రమేష్

త్వరలో రెండవ విడత భారత్ జోడో యాత్ర ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జై రామ్ రమేష్ అన్నారు. రాహుల్ ప్రసంగం ముగిసిన తరువాత ఆయన మీడియాతో మాట్లాడుతూ పాసిఘాట్ (అరుణాచల్ ప్రదేశ్) నుంచి పోర్‌బందర్ (గుజరాత్) వరకూ యాత్రను నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ మార్గంలో పెద్దఎత్తున అడవులు, నదులు ఉన్నాయని, అనేక రకాలుగా యాత్ర సాగినప్పటికీ, ప్రధానంగా పాదయాత్రే ఉంటుందని అన్నారు. కొద్ది వారాల్లోనే యాత్రక తుది రూపునిస్తామని చెప్పారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు 4న నోటిఫికేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు అందించే ఉచిత సీట్ల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలు కేటాయించాలి. 2023-24 విద్యా సంవత్సరంలో ఈ సీట్లు కేటాయించాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదివారం జిఓ 24ను జారీ చేశారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. మార్చి 4వ తేదీన నోటిఫికేషన్ విడుదలవుతుందని వెల్లడించారు. మార్చి 6 నుంచి 16వ తేదీ వరకు అన్ని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు ద్వారా అర్హులైన విద్యార్థుల జాబితాను ఏప్రిల్ 9 నుంచి 12వ తేదీ వరకు నిర్ణయిస్తారు.

లాటరీ ద్వారా ఎంపికైన మొదటి జాబితాను ఏప్రిల్ 13న వెల్లడిస్తారు. ఏప్రిల్ 15 నుంచి 21వ తేదీ వరకు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల అడ్మిషన్లను ఖరారు చేస్తాయని తెలిపారు. రెండో లాటరీ ఫలితాలను ఏప్రిల్ 25వ తేదీన వెల్లడవుతాయని వివరించారు. ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల అడ్మిషన్లను ఖరారు చేస్తాయని తెలిపారు. అర్బన్ ప్రాంత పాఠశాలల్లో ఫీజు రూ.8 వేలు, గ్రామీణ ప్రాంతంలో రూ.6,500, గిరిజన ప్రాంతాల్లో రూ.5,100లుగా నిర్ణయించారు. ఈ ఫీజును ప్రభుత్వమే పాఠశాలలకు చెల్లిస్తుంది. విద్యార్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఓటర్ కార్డు, విద్యుత్ బిల్లు, డ్రైవింగ్ లైసెన్స్, రైస్‌కార్డు, తహశీల్దార్‌తో స్థానిక పత్రం సమర్పించాలి.

తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకునే సమయంలో జాగ్రత్తగా పరిశీలించాలి. ఒకసారి సమర్పించిన తరువాత దరఖాస్తులో మార్పులు చేసుకునే అవకాశం లేదు. మరిన్ని వివరాలు cse.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

మెడికో ప్రీతి మృతి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో



ఫైల్

వరంగల్ ఎంజిఎంలో సీనియర్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేసిన పిజి విద్యార్థిని డాక్టర్ ప్రీతి ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడుతూ ఆదివారం రాత్రి 9.10 గంటలకు మృతి చెందారు. ఆమెను రక్షించేందుకు నిమ్స్ స్పెషలిస్టు డాక్టర్ల బృందం ఎంతగానో ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కాకతీయ వైద్య కళాశాలలో పిజి అనస్థీషియా మొదటి సంవత్సరం చదువుతున్న ప్రీతిని సీనియర్ పిజి విద్యార్థి సైఫ్ కొన్నాళ్లుగా వేధిస్తున్నారు. దీంతో, తట్టుకోలేక హానికరమైన ఇంజెక్షన్ చేసుకుని ఈ నెల 21న ఆమె బలవన్మరణానికి యత్నించారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన ప్రీతికి తొలుత వరంగల్ ఎంజిఎంలో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకొచ్చారు. ప్రీతి ఆరోగ్యం రోజురోజుకు క్షీణించడంతో బతికించలేకపోయామని వైద్యులు తెలిపారు. ప్రీతి కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, దోషులను కఠినంగా శిక్షిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు.

ముగిసిన గోదావరి బాలోత్సవం

- 60 విభాగాల్లో పోటీల నిర్వహణ
- విజేతలకు బహుమతుల ప్రదానం

లోపలి పేజీలో..

ప్రధాని మోడీతో గవర్నరు భేటీ

డిఇఒ సంతకం ఫోర్జరీ


- ముగ్గురు ఉపాధ్యాయులపై కేసు నమోదు



బాలఏసు స్కూల్

ప్రజాశక్తి- హిందూపురం (శ్రీ సత్యసాయి జిల్లా)

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి సంతకాన్ని ఫోర్జరీకి సంబంధించి ముగ్గురు ఉపాధ్యాయులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఉపాధ్యాయులు శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం వైసిపి మున్సిపల్ వైస్ చైర్మన్‌కు సంబంధించిన బాలయేసు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. డిఇఒ ఫిర్యాదుతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రయివేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఐదు సర్వీసు ఉంటేనే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుంది. హిందూపురంలోని బాలయేసు ప్రయివేటు హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న షరీఫాబీ, హజరాంబీ, గీతలకు ఐదేళ్ల సర్వీసు లేదు. అయినా, వీరు ఓటరుగా దరఖాస్తు చేసుకున్నారు. వీటిని డిఇఒ కార్యాలయ సిబ్బంది వెరిఫై చేశారు. ఈ సందర్భంగా డిఇఒ సంతకం ఫోర్జరీ విషయం బట్టబయలైంది. దీనిపై జిల్లా ఎస్‌పికి డిఇఒ ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎస్‌పి విజ్ఞప్తి మేరకు హిందూపురం తహశీల్దారు సౌజన్యలక్ష్మి విచారణ నిర్వహించి అధికారులకు నివేదిక పంపారు. డిఇఒ సంతకం ఫోర్జరీ చేసినట్లు తేలడంతో హిందూపురం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లోనూ ఆమె ఫిర్యాదు చేశారు. దీంతో, ముగ్గురు ఉపాధ్యాయులపైనా కేసు నమోదు చేసినట్లు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలని అధికార పార్టీకి చెందిన వారు అడ్డదారులు తొక్కుతున్నారు. వారికి సంబంధించిన పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులను అర్హత లేకున్నా ఓటర్లుగా నమోదు చేసినట్లు, ఇందుకు డిఇఒ సంతకం ఫోర్జరీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ముగ్గురి ఉపాధ్యాయుల విషయంలోనూ ఈ విధంగానే జరిగి ఉంటుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి దొంగ ఓట్లు ఇంకా ఎన్ని నమోదయ్యాయో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓటరు జాబితాను పూర్తి స్థాయిలో వెరిఫై చేయాలని, అర్హతలేని వారి ఓట్లు తొలగించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు



నెల రోజుల్లో 3 నుంచి 30వ స్థానానికి

న్యూఢిల్లీ : గౌతమ్ అదానీకి చెందిన పది లిస్టెడ్ కంపెనీల సంపద దాదాపు రూ.12 లక్షల కోట్లు ఆవిరైనట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. గత నెల 24న హిండెన్‌బర్గ్ నివేదిక విడుదలైన అనంతరం ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానంలో ఉన్న అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ నెల రోజులు తిరిగే సరికి తాజా ప్రపంచ బిలియనీర్ సూచీలో 30వ స్థానానికి పడిపోయారు. నివేదిక వెల్లడికి ముందు 120 బిలియన్ డాలర్ల సంపదతో ఉన్న అదానీ ఏకంగా 80.6 బిలియన్ల సంపదను కోల్పోయారు. ఫ్రాన్స్‌తో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న అదానీ గ్యాస్ లిమిటెడ్ మార్కెట్ విలువ గత నెలరోజుల్లో 80.68 శాతం పడిపోగా, అదానీ గ్రీన్ ఎనర్జీ 74.62 శాతం మేర నష్టపోయింది. జనవరి 24 నుంచి ఇప్పటివరకూ అదానీ ట్రాన్స్‌మిషన్ విలువ 74.21 శాతం పడిపోయింది. అదానీ పవర్, అదానీ విల్మర్, సిమెంట్ యూనిట్స్, మీడియా, అదానీ పోర్ట్స్, సెజ్‌ల మార్కెట్ విలువ గణనీయంగా తగ్గిపోయింది.

చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం

- ముగ్గురు వైద్య విద్యార్థులు దుర్మరణం



ప్రమాదానికి గురైన కారు



కల్యాణ్



ప్రవీణ్



శ్రీవికాష్

ప్రజాశక్తి- గుడిపల్లి (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా గుడిపల్లి మండలంలో ఆదివారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముగ్గురు వైద్య విద్యార్థులు దుర్మరణం చెందారు. గుడిపల్లి ఎస్ఐ రామాజంనేయులు తెలిపిన వివరాల ప్రకారం... నెల్లూరు జిల్లా పెనుబర్తి గ్రామానికి చెందిన సి.శ్రీవికాష్ రెడ్డి (21), అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన ఎవి.కల్యాణ్ (20) ఎంబిబిఎస్ నాల్గో సంవత్సరం, అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన తలారి ప్రవీణ్ కుమార్ (24) ఎంబిబిఎస్ మూడో సంవత్సరం చదువుతున్నారు. కుప్పం రూరల్ పరిధి శెట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పిఇఎస్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యనభ్యసిస్తూ కుప్పం టౌన్లో ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి ఈ కాలేజీ ప్రాంగణంలో జరిగిన తన స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వారు ముగ్గురూ వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి కుప్పం టౌన్‌కు కారులో వస్తున్నారు. శెట్టిపల్లి వద్ద ఎదురుగా వేగంగా వస్తున్న లారీ వారి కారును ఢీకొంది. దీంతో, ఈ కారు రోడ్డుపై వస్తున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. ముగ్గురు వైద్య విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. గుడిపల్లి ఎస్ఐ రామాంజనేయులు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శవ పంచనామా అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులను అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఇటలీలో పడవ మునిగి

43 మంది మృతి

రోమ్ : ఇటలీ తీరానికి శరణార్థులతో వస్తున్న పడవ ఆదివారం తెల్లవారుజామున మునిగిపోవడంతో కొన్ని నెలల చిన్నారిసహా 43 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పడవలో ఇరాన్, ఆఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్‌కు చెందిన శరణార్థులున్నారని, వారిలో 80 మందికిపైగా ప్రాణాలతో బయటపడ్డారని ఇటలీ కోస్ట్‌గార్డు అధికారులు తెలిపారు. 20 మీటర్ల పొడవున్న బోటులో తప్పనిసరి పరిస్థితుల్లో కిక్కిరిసి ప్రయాణించారని ఇటాలియన్ ప్రీమియర్ జార్జియా మెలోని పేర్కొన్నారు. అలల ఉధృతికి సముద్రంలోని బండరాళ్లను బోటు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. బోటు మధ్యకు విరిగిపోవడంతో శరణార్థులు నీటిలో మునిగిపోయారు. కోట్రోన్ ప్రావిన్స్‌లోని కలాబ్రియా గ్రామం సముద్రతీర రిసార్ట్ అయిన స్టెకాటో డి కుట్రో ఒడ్డుకు కొట్టుకువచ్చిన 28 మృతదేహాలను అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ డైవర్లు వెలికితీశారు. ఈ బోటు ఎక్కడి నుంచి బయల్దేరిందో తెలియరాలేదు.

మార్చి 26 నుంచి షిర్డీకి విమాన సర్వీసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడ నుంచి షిర్డీకి విమాన సర్వీసులు రానున్నాయి. గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి షిర్డీకి మార్చి 26 నుంచి ఈ విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఈ సర్వీసులను నడిపేందుకు ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ ముందుకు రావడంతోపాటు ప్రయాణ షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. 72 మంది ప్రయాణికుల సామర్థ్యం గల విమానం రోజూ మధ్యాహ్నం 12:25 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి 3 గంటలకు షిర్డీ చేరుకుంటుంది. షిర్డీ నుంచి మరో విమానం మధ్యాహ్నం 2:20కు బయలుదేరి సాయంత్రం 4:35 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది. విజయవాడ నుంచి షిర్డీకి ప్రారంభ టిక్కెట్ ధర రూ.4,246, షిర్డీ నుంచి విజయవాడకు రూ.4,639గా నిర్ణయించారు. ఇప్పటి వరకు షిర్డీ వెళ్లేందుకు రైలు, రోడ్డు మార్గాల ద్వారా గంటల తరబడి ప్రయాణించే వారికి ఈ సర్వీస్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఇకపై విజయవాడ నుంచి షిర్డీకి వెళ్లేవారికి 2:50 గంటల మాత్రమే ప్రయాణ సమయం అవుతుందని పలువురు భావిస్తున్నారు.

కె.విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మి మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



కళాతపస్వి కె.విశ్వనాథ్ సతీమణి జయలక్ష్మి కన్నుమూశారు. ఆమె వయస్సు 86 సంవత్సరాలు. ఆదివారం సాయంత్రం తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని జూబ్లిహిల్స్ అపోలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ నెల 2న ప్రముఖ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్ కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆయన చనిపోయిన 24 రోజులకే జయలక్ష్మి కూడా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సోమవారం హైదరాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.



బిట్రగుంట ఎస్ఐ చిన్న బలరామయ్య

బిట్రగుంట ఎస్ఐ సస్పెన్షన్

ప్రజాశక్తి -బిట్రగుంట (నెల్లూరు జిల్లా)

నెల్లూరు జిల్లా బిట్రగుంట ఎస్ఐ చిన్న బలరామయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. ఆయనను సస్పెండ్ చేస్తూ ఎస్‌పి విజయరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ర్యాగింగ్ వేధింపుల నేపథ్యంలో ఇటీవల కడనూతలలోని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. విద్యార్థి ఆత్మహత్య ఘటనపై ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు విచారణ జరిపారు. రౌడీషీటర్లు, సస్పెక్టెడ్‌లపై నిఘా లేకపోవడం, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ర్యాగింగ్‌ను నిరోధించకపోవడం వంటి కారణాల నేపథ్యంలో ఎస్ఐను సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉండడంతో ఎవరికీ స్టేషన్ ఎస్ఐగా పోస్టింగ్ ఇవ్వలేదు. కావలి ఒకటో పట్టణ ఎస్ఐ పి.ఆదిలక్ష్మికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

జగన్ బ్రాహ్మణ ద్రోహి


- **టిడిపి నేత బుచ్చి రామ్‌ప్రసాద్**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బ్రాహ్మణ ద్రోహి అని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుచ్చి రామ్‌ప్రసాద్ అన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి రంగులు వేయడానికి చేసిన ఖర్చులో 10 శాతం కూడా బ్రాహ్మణ సంక్షేమానికి ఖర్చు చేయలేదని విమర్శించారు. సంక్షేమానికి చంద్రబాబు పునాదులు వేస్తే జగన్ దానికి చెదలు పట్టించి సమాధి చేశారని ఆరోపించారు. అర్చకులకు రిటైర్‌మెంటు వయసును రద్దు చేస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు.

జక్కా పార్వతమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

- **సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**



జక్కా పార్వతమ్మ సంస్మరణ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, మాజీ శాసనసభ్యులు జక్కా వెంకయ్య సతీమణి జక్కా పార్వతమ్మను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. భర్త అడుగుజాడల్లో నడుస్తూ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమాభివృద్ధికి తన వంతు సహకారం అందించారని, అటువంటి మహోన్నతురాలిని స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జక్కా పార్వతమ్మ సంస్మరణ సభ ఆదివారం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో వి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు మిరియం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తొలుత పార్వతమ్మ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమంలో జక్కా పార్వతమ్మ సేవలు మరువలేనివని అన్నారు. పీడిత ప్రజల కోసం భర్త జక్కా వెంకన్న ఏవిధంగా పని చేశారో వాటన్నిటిల్లో పార్వతమ్మ పాత్ర ఉందని తెలిపారు. ఒక మంచి కమ్యూనిస్టుగా, అత్యున్నతమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా తన జీవితాంతం తోడ్పాటునందించిన మహోన్నతురాలని పేర్కొన్నారు. తుది శ్వాస వరకు పార్టీ కోసం పని చేసిన పార్వతమ్మ ధన్యజీవి అని అన్నారు. మిరియం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమానికి జక్కా వెంకన్న పెద్ద అండ అన్నారు. ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆయన తీసుకున్న నిర్ణయాలను ఏకీభవిస్తూ పార్వతమ్మ తన వంతు తోడ్పాటునందించారని తెలిపారు. తన కుటుంబ సభ్యులందరినీ కమ్యూనిస్టు సానుభూతిపరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, జొన్నలగడ్డ వెంకమరాజు, పి.శ్రీరాములు, డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.రాజేశ్వరరావు, జక్కా వెంకయ్య అల్లుడు డాక్టర్ సుధాకర్‌రెడ్డి, కుమార్తెలు శాంతమ్మ, శారదమ్మ, కోడలు జక్కా శేషమ్మ, సీనియర్ నాయకులు చంద్రా రాజగోపాల్, జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు జయరామిరెడ్డి, భోగేశ్వరరావు పాల్గొన్నారు.

9 నుంచి ఉద్యమ కార్యాచరణ

- **దశల వారీగా ఏప్రిల్ 4 వరకు కొనసాగింపు**
- **ఏపి జెఎసి అమరావతి**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, రిటైర్డు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి రోజురోజుకూ దయనీయ పరిస్థితుల్లోకి నెట్టబడుతోందని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ వలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో 26 జిల్లాల ఛైర్మన్లు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. అనంతరం సమావేశ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు.

ఈ నెల 27 నుంచి ఇతర ఉద్యోగ సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, ప్రజా సంఘాలు మద్దతు కూడగట్టే ప్రయత్నాలు, మార్చి 9 నుంచి ఉద్యమ కార్యాచరణ ప్రారంభించి ఏప్రిల్ 4 వరకు దశల వారీ కొనసాగించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 5న రాష్ట్ర కార్యవర్గ సమావేశం మరోసారి భేటీ అవుతుందని, ప్రభుత్వం అప్పటికీ పాజిటివ్‌గా స్పందించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని ఉధృతం చేసే నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మార్చి 9, 10 తేదీల్లో అన్ని కార్యాలయాల్లో ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలపడం, 13, 14 తేదీల్లో కలెక్టరు, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద భోజన విరామ సమయాల్లో నిరసనలు, 15, 17, 20 తేదీల్లో జిల్లా కలెక్టరు కార్యాలయాల వద్ద ధర్నాలు, 21న ఉద్యోగులందరూ వర్క్ టు రూల్ పాటించడం, అదేరోజు సెల్‌డౌన్, 24న రాష్ట్ర స్థాయిలో అన్ని కమిషనర్ కార్యాలయాల వద్ద ధర్నాలు, 27న కరోనా సమయంలో మృతి చెందిన కుటుంబాల్లో కారుణ్య నియామకాలు పొందని ఉద్యోగుల కుటుంబాల సందర్శన, ఏప్రిల్ 1న ఉద్యోగ విరమణ పొంది ప్రయోజనాలు అందని కుటుంబాల సందర్శన, 3న చలో స్పందన (కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించే రోజు) వినతిపత్రాలు ఇవ్వడం, 5న రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే తదుపరి కార్యాచరణ కోసం కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం వంటి కార్యాచరణను ప్రకటించారు.

చెరువులో పడవ బోల్తా

- **ఆరుగురు యువకుల గల్లంతు**

ప్రజాశక్తి -పొదలకూరు (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా)

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలోని తోడేరు గ్రామ చెరువులో ఆదివారం సాయంత్రం పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో ఆరుగురు యువకులు గల్లంతయ్యారు. మరో నలుగురు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తోడేరు గ్రామానికి చెందిన పది మంది యువకులు గ్రామ సమీపంలో ఉన్న చెరువులోకి సరదాగా బోటు షికారుకు వెళ్లారు. వారు ప్రయాణిస్తున్న పడవ ప్రమాదవశాత్తు తిరగబడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న పది మంది నీటిలో పడిపోయారు. వారిలో ఒంటేరు మహేష్, ఒంటేరు మహేంద్ర, ఏనుగు విష్ణువర్ధన్, అట్ట కిరణ్ క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. చల్లా ప్రశాంత్ (29), మన్నూరు కల్యాణ్ (27), బట్టా రఘు (23), పాటి సరేంద్ర (19), యత్తం బాలాజీ (21), అల్లి శ్రీనాథ్ (17) గల్లంతయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

బిజెపి ఓటమే లక్ష్యం

- **ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటంలో రాజీపడబోం**
- **సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే లక్ష్యమని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు కాగజ్‌నగర్‌కు ఆదివారం వచ్చిన ఆయన స్థానిక బంధం ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.దీనిలో భాగంగా బిఆర్ఎస్‌తో కలిసి పోటీ చేసే యోచనలో తమ పార్టీ ఉన్నట్టు చెప్పారు. బిఆర్ఎస్ ఏడాది కాలంగా మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతోందని, ఈ నేపథ్యంలోనే మునుగోడు అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు మద్దతిచ్చి బిజెపికి బుద్ధి చెప్పామని తెలిపారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోందని, మతోన్మాద బిజెపిని ఎదుర్కొనేందుకే తాము బిఆర్ఎస్‌తో కలిసి పోటీ చేసే ఆలోచన చేస్తున్నామని చెప్పారు. అలాగని రాష్ట్రంలో బిఆర్ఎస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు మద్దతివ్వబోమని స్పష్టం చేశారు. పోడు భూములు, దళితబంధులో అక్రమాలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంతో తమ పోరాటం కొనసాగుతుందన్నారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా మార్చి 23 నుంచి సిపిఎం ఆధ్వర్యంలో మూడు ప్రచార జాతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 30న హైదరాబాద్‌లో భారీ బహిరంగసభ నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, ఫైళ్ల ఆశయ్య, ఐద్వా రాష్ట్ర నాయకులు ఆశాలత, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కార్యదర్శులు సంకె రవి, కూశన రాజన్న పాల్గొన్నారు.



వెంకటాయపాలెంలో గృహనిర్బంధంలో ఎమ్మెల్సీ తోట, మండపేటలో తన స్వగృహంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

టిడ్కో ఇళ్లపై బహిరంగ చర్చకు బ్రేకులు

- **మండపేటలో 144 సెక్షన్ అమలు**
- **ఎమ్మెల్సీ తోట, ఎమ్మెల్యే వేగుళ్ల గృహనిర్బంధం**

ప్రజాశక్తి- మండపేట, రామచంద్రపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం గొల్లపుంత కాలనీలో నిర్మించిన టిడ్కో ఇళ్లపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మధ్య సవాళ్ల వేడి రాజేశాయి. దీంతో పట్టణంలో ఉద్రిక్తత నెలకొంది. బహిరంగ చర్చకు ఇరువురూ సై అనడంతో వాతావరణం మరింత వేడెక్కింది. ఆదివారం గొల్లపుంతలోని టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద బహిరంగ చర్చకు ఇరువురూ సిద్ధపడ్డారు. శాంతి భద్రతల దృష్ట్యా పట్టణంలో పోలీసులు 144 సెక్షన్ విధించారు. చర్చా వేదిక వద్దకు టిడిపి, వైసిపి కార్యకర్తలు వస్తుండడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. మండపేటలో వేగుళ్ల జోగేశ్వరరావు ఇంటి వద్ద, తోట త్రిమూర్తులు కార్యాలయం, రామచంద్రపురం నియోజక వర్గంలోని వెంకటాయపాలెంలోని ఇంటి వద్ద, గొల్లపుంత కాలనీలోని టిడ్కో గృహ సముదాయం వద్ద ముందస్తుగా పోలీసులు భారీగా మోహరించారు. వేగుళ్లకు సెక్షన్ 149 నోటీసులు అందించి గృహ నిర్బంధంలో ఉంచారు. వెంకటాయపాలెంలో తోట త్రిమూర్తులను పోలీసులు హౌస్‌అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వేగుళ్ల మాట్లాడుతూ చట్టాలపై ఉన్న గౌరవంతో తాను గొల్లపుంత కాలనీ వెళ్లడం లేదని తెలిపారు. మార్చి 31వ తేదీ నాటికి మిగిలిన లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో ఇళ్లు అప్పగించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మించిన గృహ నిర్మాణాల్లో కనీసం వసతులు లేవని, అందరూ చెంబు పట్టుకుని బయటికి వెళ్తున్నారని వేగుళ్ల చేసిన ఆరోపణలను రుజువు చేసేందుకు తాను బహిరంగ చర్చకు సిద్ధమయ్యానని తెలిపారు. టిడ్కో ఇళ్ల వద్ద రోడ్లు, విద్యుత్ లైన్లు, టాయిలెట్ల నిర్మాణం కొనసాగుతుందని, వాటిని చూపించేందుకు చర్చకు వెళ్లేందుకు సన్నద్ధమయ్యానని వివరించారు. ఇరువురిని పోలీసులు గృహ నిర్బంధించడంతో ఉత్కంఠకు తెరపడింది. సోమవారం వరకూ పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుదని డిఎస్‌పి బాలచంద్రారెడ్డి తెలిపారు.



గాయపడ్డ కార్యకర్తలను పరామర్శిస్తున్న బికె.పార్థసారథి, కందికుంట వెంకటప్రసాద్

కదిరి సిఐని సస్పెండ్ చేయాలి : టిడిపి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై లాఠీఛార్జి చేసిన శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణ సిఐ మధును తక్షణమే సస్పెండ్ చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి డిమాండ్ చేశారు. కదిరిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వద్ద దుకాణాల తొలగింపు నేపథ్యంలో టిడిపి కౌన్సిలర్ సుధారాణి, సిఐ మధు మధ్య శనివారం రాత్రి వాగ్వాదం, టిడిపి కార్యకర్తలపై లాఠీఛార్జి జరగడం, పలువురు గాయపడడం తెలిసిందే. పోలీసుల లాఠీఛార్జ్‌లో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి కార్యకర్తలను బికె.పార్థసారధి, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిఐ మధు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉంటూ వైసిపి ప్రభుత్వానికి తొత్తులా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఆయనపై చర్యలు తీసుకోవాలని, దాడికి గురైన టిడిపి కార్యకర్తలకు న్యాయం చేయాలని, మహిళా కౌన్సిలర్‌ను దుర్భాషలాడినందుకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని, ఈ దాడిలో పాల్గొన్న వైసిపి నాయకులపై హత్యాయత్నం కేసులు పెట్టి వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఉగ్రవాదుల కాల్పుల్లో కాశ్మీరీ పండిట్ మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ లోని పుల్వామా జిల్లాలో ఉగ్రవాదుల కాల్పుల్లో కాశ్మీరీ పండిట్ మరణించినట్లు పోలీసులు తెలిపారు. దక్షిణ కాశ్మీర్ జిల్లా అచన్ ప్రాంతంలోని సంజయ్ శర్మ మరణించినట్లుగా గుర్తించినట్లు చెప్పారు. ఓ బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న సంజయ్ శర్మ ఆదివారం ఉదయం స్థానిక మార్కెట్‌కు వెళుతుండగా కాల్చిచంపినట్లు తెలిపారు. దీంతో అధికారులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి ఉగ్రవాదుల కోసం గాలిస్తున్నారు. గత నాలుగు నెలల్లో కాశ్మీరీ పండిట్‌పై జరిగిన మొదటి దాడి కాగా, రెండు రోజుల్లో కాశ్మీరీ స్థానికుడిపై జరిగిన రెండో లక్షిత దాడిగా పోలీసులు తెలిపారు. సంజయ్‌శర్మను ఉగ్రవాదులు కాల్చిచంపడాన్ని సిపిఎం నాయకులు ఎంవై తరిగామి ఖండించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



తమిళనాడు రాజ్‌భవన్ ఎదుట సిపిఎం ఆందోళన

చెన్నై : కార్ల్‌మార్క్స్‌కు, కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన చెన్నైలోని రాజ్‌భవన్ ఎదుట భారీఎత్తున ఆందోళన చేశారు. పొలిట్‌బ్యూరో సభ్యులు జి.రామకృష్ణన్, రాష్ట్ర కార్యదర్శి జి.బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న టిఎన్‌టియుసి నాయకులు

'ఉక్కు' రక్షణకు అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లాలి

- **టిఎన్‌టియుసి నేత విల్లా రామ్మోహన్ కుమార్**

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రయివేటీకరణ బారి నుంచి పరిరక్షించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని పార్టీలతో కూడిన అఖిలపక్షాన్ని, కార్మిక సంఘాలను కేంద్రంలోని మోడీ సర్కారు వద్దకు తీసుకెళ్లాలని టిఎన్‌టియుసి విశాఖ జిల్లా అధ్యక్షులు విల్లా రామ్మోహన్ కుమార్ కోరారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 696వ రోజుకు చేరాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి నాయకులు, కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కావడానికి 32 మంది ప్రాణత్యాగం చేశారని, వేలాది మంది రైతులు భూములు ఇచ్చారని, ఈ వాస్తవాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తామని చెప్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. రెండేళ్లుగా ఉక్కు ఉద్యమం సాగుతున్నా కేంద్రం దిగిరాకపోవడం శోచనీయమన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం బాధ్యత వహించి కేంద్రంపై ఒత్తిడి తేవాల్సి ఉందని తెలిపారు. దీక్షల్లో సంఘం రాష్ట్ర ప్రధాన నాగోతి శివాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పిలి రామకృష్ణ, ఎంఎస్.కృష్ణ, దేవర అప్పలరాజు, సత్రబాయన చిన అప్పారావు, పీలా సుబ్బారావు పాల్గొన్నారు. ఎపి పరిరక్షణ జెఎసి కన్వీనర్ ప్రియాంక దండి, జగన్ మురారి శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.



విజయవాడ హైవేపై రెండు ఆర్‌టిసి బస్సులు దగ్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ఎన్‌హెచ్ 65పై చివ్వెంల సమీపంలో ఎపిఎస్ ఆర్‌టిసికి చెందిన రెండు లగ్జరీ బస్సులు దగ్ధమయ్యాయి. బ్యాటరీ నుంచి పవర్ సప్లైలో సాంకేతిక లోపాన్ని సరిచేస్తున్న క్రమంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. బస్సులోని ప్రయాణికులను ముందుగానే దించివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆర్‌టిసి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న 'వెన్నెల' బస్సులో సాంకేతికలోపం తలెత్తింది. బ్యాటరీలో తలెత్తిన సమస్యతో బస్సు హెడ్ లైట్లు పనిచేయలేదు. దీంతో డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపివేసి ప్రయాణికులను వేరే బస్సుల్లో పంపించారు. ఆర్‌టిసి అధికారులకు సమాచారం ఇవ్వడంతో.. వారు సూర్యాపేట బస్టాండ్‌లో సిద్ధంగా ఉన్న ఎపిఎస్ ఆర్‌టిసి స్పేర్ బస్సును రప్పించారు. నిలిపివుంచిన వెన్నెల బస్సుకు సమీపంగా స్పేర్ బస్సును తీసుకొచ్చి వైర్ల సాయంతో బ్యాటరీ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్పేర్ బస్సు ఇంజిన్ భాగంలో పెద్ద శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఇంజిన్ ఆఫ్ చేసి బస్సులో ఉన్న ఫైర్ ఎగ్జిస్టింగ్ ఓపెన్ చేసి మంటలు ఆపే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. దగ్గర్లో ఉన్న వెన్నెల బస్సుకూ మంటలు వ్యాపించాయి. ఫైరింజన్లు ఘటనాస్థలానికి వచ్చేలోపే రెండు బస్సులు సగం వరకు కాలిపోయాయి. ఫైర్ ఫైటర్లు గంట సేపు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో ఆ మార్గంలో రెండు గంటల సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది.

గుజరాత్‌లో స్వల్ప భూకంపం

గాంధీనగర్ : గుజరాత్‌లో భూకంపం సంభవించింది. ఆదివారం మధ్యాహ్నం 4.3 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. రాజ్‌కోట్‌కు 270 కిలోమీటర్ల దూరంలో భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. మధ్యాహ్నం 3:21 గంటలకు భూకంప కేంద్రం నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ ట్వీట్ చేసింది. ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. గతవారం గుజరాత్‌లోని అమ్రేలి జిల్లాలో రెండు రోజుల్లో మూడు చిన్నపాటి ప్రకంపనలు నమోదయ్యాయని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్మోలాజికల్ రీసెర్చ్ (ఐఎస్ఆర్) అధికారి ఒకరు చెప్పినట్లు తెలిసింది. భూమి స్వల్పంగా కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లల్లోంచి రోడ్లపైకి పరుగులు తీశారు.

అమెరికాలో కుప్పకూలిన రవాణా విమానం

- **ఐదుగురు మృతి**

వాషింగ్టన్ : అమెరికాలో పశ్చిమ రాష్ట్రమైన నెవాడాలో మెడికల్ ట్రాన్స్‌పోర్ట్ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో రోగితో పాటు ఐదుగురు మరణించినట్లు అధికారులు తెలిపారు. కాలిఫోర్నియాతో నెవాడా సరిహద్దుకు సమీపంలోని స్టేజ్‌కోచ్ పట్టణం వెలుపల శుక్రవారం రాత్రి విమానం రాడార్ నుంచి బయటపడిందని ఆర్ఈఎంసీఏ ఓ ప్రకటనలో తెలిపింది. మంచు తుఫాను కారణంగా ఘటనాస్థలానికి వెళ్లే అవకాశం లేదని తెలిపింది. విమానంలో ఉన్న ఐదుగురూ ప్రాణాలతో బయటపడలేదని సెంట్రల్ లియోన్ కౌంటీ అగ్నిమాపకశాఖ ప్రకటించింది. విమానంలో పైలట్‌తో పాటు రోగి, ఒక నర్సు, ఒక పారామెడిక్, రోగి బంధువు ఒకరు ఉన్నారని ఆర్ఇఎంసిఎ హెల్త్ పేర్కొంది.

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి- తిరుపతి సిటి

తిరుపతిలో ముగ్గురు అంతరాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. 13 ఎర్రచందనం దుంగలు, కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి ఎస్‌పి పరమేశ్వరరెడ్డి కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం ఎర్రవారిపాళెం పోలీసులకు అందిన సమాచారం మేరకు యల్లమంద పంచాయతీ ఉస్తికాలయ పెంటరోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో అనుమానస్పదంగా ఉన్న ఒక కారు, ఒక మోటారు సైకిల్‌ను వెంబడించారు. నిందితులు తప్పించుకోవాలనే ప్రయత్నంలో ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డుకు గాయపరిచారు. అప్రమత్తమైన సిఐ, ఎస్ఐ ఆ నలుగురునీ అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించారు. వారిలో ఒకరు తప్పించుకున్నారు. మగినిల ముగ్గురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.21,94,000లు విలువ చేసే 13 ఎర్రచందనం దుంగలు, కారు, పల్సర్ మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వ్యక్తి సత్యరాజ్ రాజేంద్రన్ ప్రధాన నిందితుడని, లపట్టుపడిన ముగ్గురు ముద్దాయిలు తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకు చెందిన కె రవికుమార్, కె సుధాకర్, వేలూరుకు చెందిన ఎ మునివేలుగా గుర్తించారు.

సిసోడియా అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు భద్రతను పెంచారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను మోహరించారు.

సిసోడియా అరెస్టు ఊహించిందే..: ఆప్

ఢిల్లీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియాను సిబిఐ అధికారులు కస్టడీలోకి తీసుకున్న కొద్ది నిమిషాల్లోనే ఆయన్ను అరెస్టు చేస్తారని తమకు తెలుసని ఆప్ పేర్కొంది. సిబిఐ పూర్తిగా కేంద్రం ఆదేశాల మేరకే పనిచేస్తోందని విమర్శించింది. మనీష్‌ను అరెస్టు చేస్తారని తమకు ఎప్పటి నుంచో తెలుసని ఆప్ ఎమ్మెల్యే సురభ్ భరద్వాజ్, ఎంపి సంజయ్ సింగ్ అన్నారు. దర్యాప్తు సంస్థలు ఎలా పనిచేస్తాయో ముందే చెప్పగలిగే పరిస్థితులు ఉండటం విచారకరమన్నారు. ఢిల్లీ, పంజాబ్ సిఎంలు కేజ్రీవాల్, భగవంత్‌మాన్ తదితర నేతలు సిసోడియా నివాసానికి వెళ్లారు.


పి.ప్రసాద్
రాష్ట్ర అధ్యక్షులు


కె.పోలారి
ప్రధాన కార్యదర్శి

ఐఎఫ్‌టియు నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరంలో రెండు రోజులపాటు జరిగిన ఐఎఫ్‌టియు రాష్ట్ర 9వ మహాసభ ఆదివారంతో ముగిసింది. మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా పి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె.పోలారి ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వర్లు, జె.వెంకటేశ్వర్లు, ఆర్.హరికృష్ణ, రాష్ట్ర కార్యదర్శులుగా యు.వెంకటేశ్వరావు, జి.భారతి, డి.గణేష్, కోశాధికారిగా కె.వి రమణ ఎన్నికయ్యారు. వీరితోపాటు 24 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ముగిసిన గోదావరి బాలోత్సవం

- 60 విభాగాల్లో పోటీల నిర్వహణ
- విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలతో ఎంఎల్‌సి సాబ్జీ తదితరులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలోని ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో రెండ్రోజులుగా జరిగిన 'గోదావరి బాలోత్సవం' ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో 60 విభాగాల్లో చిన్నారులకు పోటీలను నిర్వహించారు. ముగింపు వేడుకల్లో భాగంగా బహుమతి ప్రదానోత్సవం జరిగింది. గోదావరి బాలోత్సవం ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి పివిఎస్‌ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలల స్వేచ్ఛను హరించొద్దని తల్లిదండ్రులకు సూచించారు. వారికి నచ్చిన రంగంలో ప్రోత్సహించాలన్నారు. ఈ బాలోత్సవంలో అనేక మంది బాలలు మట్టితో ఎన్నో అద్భుతాలను సృష్టించారని గుర్తు చేశారు. ప్రస్తుతం నడుస్తున్న విద్యా వ్యవస్థ సమాజ అభివృద్ధికి దోహదపడదం లేదని, బట్టీ చదువులు సమాజానికి మంచి చేయబోవన్నారు. ప్రముఖ న్యాయవాదులు మద్దూరి శివసుబ్బారావు, ముప్పాళ్ల సుబ్బారావు, అర్బన్ ఎడ్యుకేషనల్ అధికారి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ బాలల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీయడం ద్వారానే మంచి సమాజం ఏర్పడుతుందని, అందుకు ఇలాంటి బాలోత్సవాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రెట్టించిన ఉత్సాహంతో నిర్వహిస్తాం

రెండు రోజులపాటు నిర్వహించిన గోదావరి బాలోత్సవం ఎంతో స్ఫూర్తిని ఇచ్చిందని, ఈ స్ఫూర్తితో వచ్చే ఏడాది రెట్టించిన ఉత్సాహంతో గోదావరి బాలోత్సవాన్ని నిర్వహిస్తామని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పివిఎస్‌ఎన్ రాజు, గోదావరి బాలోత్సవం కార్యదర్శి పి తులసి వెల్లడించారు.


చివరి రోజు విద్యార్థుల కోలాటం



ప్రధాని మోడీతో గవర్నరు భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో రాష్ట్ర గవర్నరు అబ్దుల్ నజీర్ భేటీ అయ్యారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం గవర్నరు శనివారం ఢిల్లీకి చేరుకున్నారు. ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో భేటీ అయ్యారు. రాష్ట్ర గవర్నరుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఢిల్లీ వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

దాచేపల్లి ఘటనలో దోషులను శిక్షించాలి

- ఎపి రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పల్నాడు జిల్లా దాచేపల్లి మండల కేంద్రంలో గరికపాటి కోటేశ్వరరావు దారుణహత్యపై సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య, రాష్ట్ర నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, బొజ్జ సుబ్బారావు, పాగోలు శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లి మండల కేంద్రంలో గరికపాటి కోటేశ్వరరావును బంబోతుల సైదులు, ఆయన కుమారుడు నాగరాజు కలిసి అతి దారుణంగా హత్య చేసి ,శవాన్ని ముక్కలుగా నరికి ఎలాంటి ఆనవాళ్లు లేకుండా దహనం చేశారని తెలిపారు. ఈ దారుణ హత్యపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలో ఉద్యోగం చేస్తూ చట్ట విరుద్ధంగా శవానికి ఆనవాళు లేకుండా పొలంలో కాల్చివేయడం దారుణమని అన్నారు. బంబోతుల సైదులు, నాగరాజుపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కూలీలను వేధించొద్దు

- మావోయిస్టు పార్టీ సౌత్ బస్తర్ డివిజన్ కార్యదర్శి గంగ

ప్రజాశక్తి - చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ ప్రాంతంలో పోలీసులు కూలీలను వేధించడం తగదని మావోయిస్టు పార్టీ సౌత్ బస్తర్ డివిజన్ కార్యదర్శి గంగ డిమాండ్ చేశారు. సుక్మా జిల్లాలో శనివారం జరిగిన ఎదురు కాల్పుల నేపథ్యంలో ఆ ప్రాంతమంతటా భద్రతా దళాల కూంబింగ్ చర్యలు ముమ్మరం కావడంతో ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాగర్‌గూడ ప్రాంతంలో జరిగిన కాల్పులతో బస్తర్ మొత్తాన్ని పోలీసు క్యాంపుగా ప్రభుత్వం మార్చేసిందని పేర్కొన్నారు. నాలుగు నెలల్లో మొత్తం తొమ్మిది క్యాంపులు తెరిచి ఈ ప్రాంతంలో భయానక వాతావరణం సృష్టిస్తోందని విమర్శించారు. అత్యాధునిక సైనిక హెలికాప్టర్లు, డ్రోన్లు, నిఘా విమానాల సహాయంతో ఆ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తున్నారని, మినపా క్యాంపుతో సహా ఇతర పోలీసు స్టేషన్లు, శిబిరాల్లో కాల్పులు, బాంబు దాడులకు రిహార్సల్స్ చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైమానిక దాడులను తీవ్రతరం చేసేందుకు సిద్ధమవుతున్నాయని విమర్శించారు. మరోవైపు తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలకు మిర్చి కోత, ఇతర కూలి పనుల కోసం వెళ్తున్న వారిని మావోయిస్టులుగా అనుమానిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఓటమి భయంతోనే అడ్డదారులు

- అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వైసిపి
- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

శాసన మండలి ఎన్నికల్లో వైసిపి ఓటమి భయంతో దిగజారుడు పద్ధతులు అవలంబిస్తోందని, అక్రమాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ విమర్శించారు. విశాఖ హెచ్‌బి.కాలనీలోని వేదిక ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో అధికార వైసిపి అడ్డదారులు తొక్కుతోందని విమర్శించారు. 250కుపైగా ప్రజా సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పోటీ చేస్తుంటే, అదే పేరుగల వేరే అభ్యర్థితో వైసిపి ఆఖరి రోజున నామినేషన్ వేయించిందన్నారు.

ఓటర్లను గందరగోళ పరచడానికే ఈ విధంగా చేశారని, ఇది చవకబారు దిగజారుడుతనం తప్ప మరొకటి కాదన్నారు. ఎయు వైస్ ఛాన్సలర్ వర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా దసపల్లా హోటల్‌లో ఇటీవల సమావేశం నిర్వహించారని, అది బయటకు తెలిసి, ప్రజా సంఘాల నాయకులు, పిడిఎఫ్ మద్దతుదారులు కొంతమంది హాల్‌లోకి వెళ్లడంతో విసి దొడ్డిదారిన పరారయ్యారని తెలిపారు. సర్ సిఆర్.రెడ్డి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి



మహానుభావులు కూర్చున్న కుర్చీకి కళంకం తెచ్చేదిగా విసి వ్యవహార శైలి ఉందన్నారు. తాము ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణను కూడా వారు తమ అధికారంతో ప్రభావితం చేస్తున్నారని, సాక్ష్యాలను తారుమారు చేయడానికి యత్నిస్తున్నారని విమర్శించారు. అంతకు ముందు కెజిబివి అధికారుల ద్వారా విజయనగరం, విశాఖపట్నంలలో కూడా ఇలాంటి సమావేశాలే నిర్వహించారని గుర్తు చేశారు. వలంటీర్ల ద్వారా అర్హతలేని వారి ఓట్లు చేర్పించారన్నారు. సక్రమంగా ఎన్నికలు జరిగితే ఓటమి ఖాయమని తెలిసే ఇలాంటి నీచ చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైసిపి అధికారంలోనికి వచ్చిన ఈ నాలుగేళ్లలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి చేసిందేమీ లేదని తెలిపారు.

స్టీల్‌ప్లాంటును అమ్మేస్తున్న కేంద్ర ప్రభుత్వంతో లాలూచీ పడుతోందన్నారు. రైల్వే జోన్, మెట్రోరైల్, పోలవరం నిధులు, రాష్ట్ర విభజన చట్టాన్ని అమలు చేయని మోడీ ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట అనడంలేదని తెలిపారు. వీరి కుతంత్రాలను తిప్పికొట్టాలని, ఈ ప్రాంత ప్రజల వాణిని చట్ట సభలో సమర్థవంతంగా వినిపించగలిగే డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అధికార పార్టీ అక్రమాలు మరింత మితిమీరిపోయే అవకాశం ఉన్నందున ఎన్నికల కమిషన్ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

'వివేకా' కేసులో వాస్తవాలు దాచేందుకు ప్రయత్నం

మాజీ మంత్రి కళా వెంకట్రావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివేకా హత్యకు సంబంధించిన వాస్తవాలు దాచేందుకు ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళా వెంకట్రావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రిగా జగన్ స్థానంలో ఎవరున్నా సొంత బాబాయిని హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించి తీరుతారని తెలిపారు. విచారణాధికారులకు సహకరిస్తారని పేర్కొన్నారు. కానీ జగన్ అందుకు విరుద్ధంగా.. హంతకులకు అండగా నిలుస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేసింది నిజం కాదా? అని జగన్‌ను ప్రశ్నించారు. సిబిఐ విచారణను తెలంగాణ రాష్ట్రానికి సుప్రీం కోర్టు ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈ హత్యతో జగన్, భారతి, అవినాష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, గజ్జల ఉమాశంకర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, సునీల్ యాదవ్‌కు సంబంధం ఉందని అన్నారు. చంద్రబాబుకు వ్యవస్థలను మేనేజ్ చేసే లక్షణాలే ఉంటే జగన్‌ను జైలు నుంచి బయటకు ఎందుకు రానిచ్చేవారు? జగన్ సిఎం అయ్యే వారా? పాదయాత్ర చేసేవారా? రాష్ట్రం జగన్ చేతిల్లో రావణకాష్టం అయ్యేదా? అని అన్నారు. వివేకా కూతురు సునీత అడిగిన ప్రశ్నలకైనా ఎందుకు సమాధానం చెప్పలేదని ప్రశ్నించారు.

వైసిపిది అసమర్థ పాలన : లోకేష్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో:

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అసమర్థ పాలన కొనసాగిస్తోందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. యువగళం పాద యాత్ర 28వ రోజు ఆదివారం తిరుపతి రూరల్‌లో కొనసాగింది. తిరుచానూరు లోని అయ్యప్ప ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బస కేంద్రం నుంచి తిరుచానూరు అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి వసుందర నగర్, తనపల్లి, మీదుగా వెళ్లి భాగ్యనగరం లో భోజన విరామం తీసుకున్నారు. అనంతరం కూపుచంద్రపేట, దుర్గసముద్రం, అడపారెడ్డిపల్లి మీదుగా శివగిరి చేరుకొని అక్కడ బస చేశారు. తన పల్లిలో ఇటీవల కొట్టుకుపోయిన లెవల్‌కాజ్‌వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహనలేని సిఎం జగన్ వల్ల నేడు రాష్ట్రానికి ఈ దుస్థితి వచ్చిందన్నారు. వర్షాకాలంలో కనీస అంచనాలు లేకుండా జగన్ ప్యాలస్‌లో పడుకోవడం వల్ల అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయిందని, 60 మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. స్వర్ణముఖి నదిపై ఉన్న 7లో లెవల్ కాజ్‌వేలు వరదల్లో దెబ్బతిన్నాయని, తాత్కాలికంగా మట్టి, పైపులు వేసి జగన్ ప్రభుత్వం చేతులు దులుపుకుందని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యని శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఈశ్వర్‌రెడ్డి, పి.మోహన్, పులివర్తి వినిల్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తా : నారా లోకేష్

ఉపాధ్యాయ సంఘాలు నారా లోకేష్‌ను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, ఒపిఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యా యుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామన్నారు. టీచర్లు ఎటువంటి వేధింపు లు లేకుండా స్వేచ్ఛగా పనిచేసుకునే వాతావరణం కల్పిస్తామని హామీ ఇచ్చారు.


తిరుపతి రూరల్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న లోకేష్

లోకేష్ బస ముందు వైసిపి నిరసన

లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర బస కేంద్రం వద్ద వైసిపి నాయకులు ఆదివారం నిరసనకు దిగారు. నారా లోకేష్ పాదయాత్ర శనివారం తిరుపతి అర్బన్ నుంచి రాత్రి తిరుపతి రూరల్‌లోని తిరుచానూరు వద్దనున్న అయ్యప్ప ఆలయం వద్ద వరకు సాగింది. అనంతరం ఆయన అక్కడే ఏర్పాటు చేసిన కేంద్రంలో బస చేశారు. శనివారం పాదయాత్రలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన తనయుడు భూమన అభినయ్‌రెడ్డిని ఉద్దేశించి నారా లోకేష్ తిరుపతికి ఇద్దరు ఎమ్మెల్యేలు అని ఎద్దేవా చేసిన విషయం విధితమే. ఆ మాటలను వ్యతిరేకిస్తూ వైసిపి యువజన నాయకులు ఆందోళన చేశారు. లోకేష్ బస చేస్తున్న ఎసి కంటైనర్ వద్ద నిరసన తెలిపారు. పోలీసులు సర్దిచెప్పి వారిని అక్కడ నుంచి పంపివేశారు.


ఆలయంలో సిజెఐ చంద్రచూడ్ దంపతులు, జడ్జి నరసింహ దంపతులు

శ్రీశైల మల్లన్న సన్నిధిలో సిజెఐ దంపతులు

ప్రజాశక్తి- శ్రీశైలం

శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామిని చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా వై చంద్రచూడ్, ఆయన భార్య కల్పనా దాస్, సుప్రీంకోర్టు జడ్జి పిఎస్ నరసింహ ఆయన భార్య సత్యప్రభ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డి వారి చక్రపాణి రెడ్డి, దేవస్థానం ఇఒ లవన్న, అర్చకస్వాములు, వేద పండితులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం వరుసగా రత్నగర్భగణపతిస్వామిని, మల్లికార్జునస్వామిని, మల్లికా గుండంలో (సరస్వతీ నదీ అంతర్వాహిని) ప్రతిబింబించే ఆలయ విమాన గోపురాన్ని, భ్రమరాంబ అమ్మవారిని సిజెఐ దంపతులు, సుప్రింకోర్టు జడ్జి దంపతులు దర్శించుకున్నారు. చక్రపాణి రెడ్డి, ఇఒ లవన్న వారికి స్వామివారి, అమ్మవారి చిత్ర పటాలను అందజేశారు.వారి వెంట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రిజిస్ట్రార్ జనరల్ వై లక్ష్మణరావు, తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రార్ జనరల్ కె సుజన, దేవాదాయశాఖ కమిషనర్ డాక్టర్ ఎం హరి జవహర్ లాల్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, కర్నూలు ఎన్ శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, జిల్లా ఎస్పి కె రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి నిశాంతి ఉన్నారు.

కర్నూలులో మొబైల్ రికవరీ మేళా

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లాలో దొంగిలించిన సెల్ ఫోన్లను భారీ ఎత్తున రికవరీ చేశామని కర్నూలు జిల్లా ఎస్పి సిద్ధార్థ కౌశల్ తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 5,727 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వాటి విలువ సుమారు రూ.12 కోట్లు ఉంటుందని తెలిపారు. పోగొట్టుకున్న సెల్‌పోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించేందుకు కర్నూలులోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం మొబైల్ ఫోన్ రికవరీ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశామని తెలిపారు. మొదటి విడతలో 653 (రూ.1.2 కోట్లు) ఫోన్లు, రెండవ విడతలో 1,064 (రూ.2.8 కోట్లు), మూడవ విడతలో 2,086 (రూ.2.5 కోట్లు), నాలుగవ విడతలో 1,924 (రూ.3.50 కోట్లు) మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ (బాపట్ల, విశాఖపట్నం, కష్ణా, గుంటూరు, అనంతపురం, కడప, నంద్యాల), ఉత్తరప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర తమిళనాడు, కర్ణాటక, బీహార్, రాజస్థాన్, తెలంగాణ, రాష్ట్రాల నుండి కూడా బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



స్టూడెంట్స్

వాళ్లంతా ఎటు వెళ్తున్నారు?
గుంపులు గుంపులుగా
ఎవరి ముఖాన్ని వారి అరిచేతుల్లో దాచుకొని
స్థైర్యం ధైర్యం ఆత్మవిశ్వాసం ఆనందం ఏమీలేక
భయం భయంగా తొందర తొందరగా
ధగధగమనే పగటి చీకటిలో
మూస కలల వెంట.. మూకలు మూకలుగా!

కాలేజీ క్యాంపస్సు క్యాంటీను
ప్లేగ్రౌండు లైబ్రరీ ఎక్కడ చూసినా వాళ్ళే..
బెల్లం కొట్టే రాళ్లలా!
పెద్ద పెద్ద మర్రిచెట్లలాంటి ప్రైవేటు క్యాంపస్సుల్లో
మాటిమాటికీ కళ్లద్దాలు సర్దుకొని
వేల పేజీల పుస్తకాలు
తలవాల్చి నడుస్తున్నట్టున్నాయి
నడుములు ఒంగిన లాప్టాపులు
అప్రోచ్ రోడ్డు పక్కన చెట్టు కింద బెంచీలో
కూలబడినట్టున్నాయి
ఎక్కడా కరెంటు తీగల్లాంటి విద్యుత్ చైతన్యం
మచ్చుకైనా లేదు
నిలువు బొట్టుతో నిశ్శబ్దం రాజ్యమేలుతున్న చోట
ఏ కుర్ర ప్రశ్నల సవ్వడీ కనిపించడం లేదు

జడివానల్లా కూడికయ్యే పిడికిళ్లు
వరదల్లా పోటెత్తే దేహాలు
పిడుగుల్లా గర్జించే కంఠాలు
స్వేచ్ఛాకాశాలను ఆక్రమించే మబ్బుల్ని
ఎప్పటికప్పుడు మెరుపులై చెండాడే జెండాలు
ఇపుడేమైపోయాయి?

ఎటు చూసినా సెల్ ఫోన్లను
హిప్నటైజ్ చేస్తున్న చురుకు కళ్ళు..
కూలింగ్ గ్లాసులు పెట్టుకున్న బీరు బుడ్డీలు
ఒంటరొంటరిగా నడుస్తున్నట్టుంది
అసలు ఈ నేలనంతా వెలిగించాల్సిన వాళ్లు..
దోపిడీ కాలాలకు ఎదురు నిలబడి
భవిష్యత్తును దారి మళ్లించాల్సిన వాళ్ళు..
వాళ్ళేమయ్యారు?

గదిలోపలి గదిలోపలి గదిలోపలి
గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నట్టున్నారు
కిటికీలు కూడా మూసుకున్నట్టున్నారు
ఉద్యోగ బానిసత్వానికి సిద్ధపడి
కెరీర్ గదుల్లో తలదూర్చి మాయమైపోయారు

చల్లగా ఈ నేలనంతా
ఉల్లిబాములు నొళ్ళుకున్నాక గానీ
టీనేజర్లు ఈ నెత్తుటి నేలవంక చూసేలా లేరు!

– కంచరాన భుజంగరావు
94415 89602



ఫ్యూజన్!

అతడు
యుగాలను రవళించే పాలధారలాంటి
సూర్యుడు
ఆమె !
నాలుగు చినుకుల కలవరింతయ్యే
భూమి
పిల్లలు!
రంగురంగుల పిట్టల మాటల కేరింతల్లాంటి
ఋతువులు

సూర్యుడు
రాత్రంతా అక్షరాల్లో నలిగి
ఉదయాన్నే పుస్తకాల పుటలలోంచి నిద్రలేచే
అతడు !
భూమి
చిటికెడు వెలుతురు కోసం
పుస్తకాల గది చుట్టూ ప్రదక్షిణ చేసే
ఆమె !
ఋతువులు
తలపు తలపుకీ
కొత్త కవితావాక్యాల రూపమెత్తే
పిల్లలు!

అతడు
ఆమె
పిల్లలే
ఆ ఇల్లు..

ఆ ఇల్లే,
అక్షర నక్షత్రశాల!
కవితా పాదాల పాలపుంత!!
పుస్తకాల ఫ్యూజన్!

(కవిమిత్రుడు అంకె శ్రీనివాస్ కోసం...)

– కొత్తపల్లి సురేశ్

ఆశావాహం


దేహమంతా సందేహాన్ని నింపుకుని
చేతులు చాచి వేచి ఉన్నపుడు..
చేరిన ఋతువులన్నీ
శిశిరపు జాబిలాయిలా
ఏకాంత శిఖరపై మిగిలాను!

శ్వాసలో విశ్వాసాన్ని పొదిగి
ఆశను ఆవాహనం చేసుకోగా..
నీప్పటి వచ్చి చెంత చేరింది
ఆహ్వానించనే ఆలింగనం చేసుకుంది
ఉత్తుంగ తరంగాల సంద్రమై నిలిచాను
మానవ జీవన సౌందర్యమై వెలిశాను!

– డా. డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ.
94408 36931

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti



ఉత్తమ సాహిత్యానికి జన్మస్థానం సమాజ జీవితమైనట్లే- దాని గమ్యస్థానం కూడా సమాజ జీవితమే!
– రాచమల్లు రామచంద్రారెడ్డి

ప్రయోగాత్మక ప్రదర్శనలు

రంగస్థలం

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా, ఢిల్లీ; భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా, భారత్ రంగ మహోత్సవాన్ని ఈనెల 19 నుంచి 23 వరకు రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో నిర్వహించారు. ఎన్ఎస్‌డిగా పిలువబడే నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ప్రపంచంలోనే అగ్రగామి శిక్షణ సంస్థల్లో ఒకటి. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖను 1959లో న్యూఢిల్లీలో ఏర్పాటు చేసింది. కేంద్ర ప్రభుత్వం, మన రాష్ట్రంలో నాటక రంగ కార్యకలాపాలు నాటక సమాజాల వారి ద్వారా స్వచ్ఛందంగా విరివిగా జరుగుతున్నా, పరిమితమైన అవగాహన వల్ల జాతీయ అంతర్జాతీయ నాటక రంగంతో పోల్చినప్పుడు ఆ నాటక ప్రదర్శనలు పేలవంగానే కనబడతాయి. అధిక శాతం. కొత్త కొత్త ప్రయోగాలు వాటిని ప్రోత్సహించే ప్రత్యేక మార్గదర్శక సంస్థ ఒక్కటి కూడా లేకపోవడం వల్ల, మన రాష్ట్రంలో నాటక రంగానికి దశ దిశా నిర్దేశం కొరవడింది. ఐదులోనూ ఈనాటి సాంకేతిక యుగంలో అది మరింత వెనుకబడి ఉన్నట్లు కనిపిస్తుంది. ఒకనాటి నాటక రంగ ఉజ్వలమైన రోజుల్ని తిరిగి ఉద్దీపింప చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఎస్‌డి శాఖనొక దానిని స్థాపించాల్సిన అవసరం గుర్తించింది.

ఆ దిశగా రాష్ట్రంలో ఎన్ఎస్‌డి ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ప్రతిపాదనలు సమర్పించింది. ఆ దిశగా రాజమండ్రిలో 22వ భారత్ రంగ మహోత్సవం (థియేటర్ ఫెస్టివల్) నిర్వహించింది. ఫిబ్రవరి 19న శ్రీ వెంకటేశ్వర సురభి థియేటర్ గ్రూప్, హైదరాబాద్ వారిచే 'భక్త ప్రహ్లాద' పౌరాణిక నాటకం; 20న అస్తిత్వ థియేటర్ గ్రూప్ మంగుళూరు వారిచే 'కండోనియన్స్' నాటకం; 21న అన్వేషా థియేటర్ స్పేస్ గ్రూప్ పాలక్కాడు వారిచే ఎల్ఐబి (లెట్ ఇట్ బి) నాటకం, 22న బ్యాక్ ఆన్ స్టేజ్ థియేటర్ గ్రూప్ బెంగళూరు వారిచే శ్మశాన కురుక్షేత్రం నాటకం, 23న మనలంగుడి థియేటర్ ల్యాండ్ గ్రూప్, కోవిల్ పట్టి తమిళనాడు వారిచే ఇడాకిని కథయారథం నాటకం ప్రదర్శనలు జరిగాయి.



ఇవీ, ఇతివృత్తాలు

1. స్తంభంలో శ్రీహరిని చూపించమన్నందుకు స్తంభాన్ని బద్దలు కొట్టుకుంటూ వెలువడిన శ్రీమహావిష్ణువు నరసింహావతారం హిరణ్యకశిపుని సంహరించటం– భక్త ప్రహ్లాద నాటక ఇతివృత్తం.
2. 'కండోనియన్స్' నాటకం– ఒక సాధారణ టీ స్టాల్ యజమాని, వీసా ఏజెంట్ ద్వారా కండోనియన్ అనే దేశంలో పడరాని పాట్లు పడి నర్సన్‌లో కోటిలా భుక్తి కోసం పనిచేసే క్రమంలో బూటకపు ప్రపంచపు దొల్లతనం అతడికి అనుభవంలోకి వస్తుంది.
3. పుస్తకాలను ఎంతో ఇష్టపడే ఒక లైబ్రేరియన్ అనేక భాషల రచయితలను వారి రచనల్లోని పాత్రలను కలుసుకుంటాడు. పుస్తకంలో కనిపించని ఒక పేజీని తిరిగి సంపాదించే ప్రయత్నంలో ప్రసిద్ధులైన వారినెందరితోనో సంభాషిస్తాడు. చివరకు లైబ్రరీ అంటే 'ఒక గతించిన జ్ఞాపకం' అని తన వెతుకులాటలో గమనిస్తాడు.
4. 'శ్మశాన కురుక్షేత్రం' నాటకాన్ని ప్రసిద్ధ మలయాళ కవి కువెంపు రాశారు. మహాభారత కురుక్షేత్ర యుద్ధపు భయంకర పరిణామాలను ప్రతిబింబించి చూపిస్తుంది, ఈ నాటకం.
5. 'ఇడాకిని కథయారథం' వలసల కారణంగా చరిత్ర అంతటా అనేకమంది మానవులు నాశనం అయిపోయిన విధం, మానవ పరిణామ క్రమంలో వలసలు ఎలాంటి విపరిణామాలకు దారితీశాయో చెబుతుంది. ఇప్పటికీ



అనివార్యంగా కొనసాగుతున్న వలసల క్రమాన్ని విప్పి చెబుతుంది ఈ నాటకం.

సాహిత్య సాంస్కృతికపరంగా విశిష్టమైన స్థానం కలిగిన రాజమహేంద్రిలో ఈ భారత్ రంగ మహోత్సవం జరగడం మంచి పరిణామం. ఇది తెలుగు నాటక రంగాన్ని మలుపు తిప్పే అతి ముఖ్యమైన చరిత్ర ఘట్టం కాగలదు. ప్రదర్శించిన నాటకాలను విశ్లేషణాత్మకంగా వాటి వస్తు, ప్రదర్శనా వైవిధ్యతను ఇలా చెప్పుకోవచ్చు.

కండోనియన్స్ : దామన్న, ఒక సాధారణ టీ స్టాల్ యజమాని, మోసగాడైన వీసా ఏజెంట్ ద్వారా 'కండోనియన్' అనే దేశంలో పడరాని పాట్లు పడతాడు. ప్రదర్శనను ప్రయోగాత్మక శైలిలో దర్శకుడు తీర్చిదిద్దిన తీరు, రంగాలంకరణ, రంగోద్దీపనం .. చాలా కొత్తగా అనిపిస్తాయి. నటీనటులు, సాంకేతిక వర్గం కలిసి నాటక ఇతివృత్తాన్ని ఎంతగా పండించవచ్చునో, సమాజాన్ని విమర్శనాత్మకంగా చూపిస్తూనే ప్రేక్షకులను ఆలోచనలో పడవేసే, దిశానిర్దేశం ఇచ్చే ప్రదర్శనగా ఎలా రూపొందించ వచ్చో రుజువు చేసింది ఈ సందేశాత్మక కన్నడ నాటకం.

LIB (Let it bother) : ఇది మలయాళ నాటకం. కొందరికి వృత్తితో ఎంత అనుబంధం ఏర్పడిపోతుందంటే అందులో విరమణ పొందినా మనసు ఆ పని ప్రదేశంలో తారట్లాడుతూ ఉంటుంది. ఒక గ్రంథ పాలకుని (ఈ మనోదశనే రచయిత చూపిస్తూ) యొక్క భావోద్వేగాలను స్వగతంలోనే అయినా బిగ్గరగా మాట్లాడుకుంటూ ఉంటాడు. బ్రెష్ట్ థియరీ ప్రకారం– ప్రేక్షకుడు ఒళ్ళు మర్చిపోయి లీనమైపోకుండా, ఆతడు పూర్తి స్పృహలో ఉండి, జరిగేది నాటకం, తాను చూస్తున్నది ఒక కల్పిత కథాంశం అని అనుక్షణం గుర్తు చేస్తూ తాదాత్మ్య విచ్ఛిత్తినే ప్రతిపాదిస్తాడు. అందువల్ల ప్రేక్షకుడిని సచేతనంగా ఉంచి భావోద్వేగాల ప్రవాహంలో కొట్టుకొని పోయేలా చేయకూడదన్నది ఆ థియరీ. ఈ నాటికలో అలా ఒక భావ ప్రవాహంలో కొట్టుకుని పోకుండా చేసే పాత్రలు ఒక మగ, ఆడ ఎలుకలు. వాటితో సంభాషించడం, అవి చెప్పినట్లు ప్రధాన పాత్ర నడుచుకోవడం. గ్రంథాలయాల ఉనికి ప్రశ్నార్థకంలో పడుతున్న నేపథ్యంలో, గ్రంథాలయంలో కనిపించకుండా పోయిన ఒక పుస్తకంలోని చివరి పేజీ కోసం తాపత్రయ





పడుతూ ఉంటాడు ఆ గ్రంథ పాలకుడు. చీకటి వెలుగుల మధ్య మానసిక భావోద్వేగాలకు తగ్గ సంగీతపు హెచ్చుతగ్గులు ప్రేక్షకుడిని, 55 నిమిషాల పాటు రెప్పవాల్చకుండా చూసేలా చేస్తాయి. అదే లెట్ ఇట్ బోదర్ నాటకం.

శ్మశాన కురుక్షేత్ర : ఎన్ఎస్‌డి శిక్షణ పొందిన 2009 బ్యాచ్ నటీ, దర్శకురాలు సవిత రైద్య. తన మీద కువెంపు మహా కవి ప్రభావం ఉందని చెబుతూ.. ఆయన ప్రకృతి, శాంతి ప్రియత్వం, ఎంతో గొప్పవి అంటూ పురాణేతిహాసాలలోని ఘట్టాలను ప్రస్తుత సమాజంలోని యుద్ధ ప్రీతి, యుద్ధ విధ్వంసాలు, స్వస్థ తాగునీటి కొరత, స్త్రీ శక్తి వంటి విషయాల మీద దృష్టి పెట్టి ఈ రంగస్థల రచనకు, తాను తన ఆలోచనలను జోడించి, అనుభవం ఉన్న కళాకారులను ఎన్నుకొని, తానే కాస్ట్యూమ్ డిజైన్ చేసి, దర్శకత్వం వహించానని తెలిపారు.

ద్వాపర పురుషుడు, కలి స్త్రీ(గా)ని (ఇక్కడ దర్శకురాలు స్త్రీ శక్తిని తక్కువగా అంచనా వేసిన కలి పురుషుడితో జరిపిన సంవాదంలో ఆమె ఆధునిక స్త్రీవాద దృక్పథం మనకు కనిపిస్తుంది) ద్వాపరంలోని స్త్రీల జీవితం కంటే ఆధునిక కాలంలో స్త్రీ జీవితం మరింత క్లిష్టమైనదిగా భావిస్తుందని, యుద్ధ విధ్వంసాత్మక వాతావరణంలో తన సృష్టి, సంతానాన్ని పరిరక్షించుకునే గురుతర కార్య భారాన్ని నిర్వహించలేకపోతున్నందున తనను తక్కువగా అంచనా వేయొద్దంటుంది. నాటక ప్రారంభ దశ్యమే హిట్లర్ జాత్యహంకార ప్రసంగంతో ప్రారంభమై, అది నిన్న మొన్నటి ఆఫ్ఘాన్ ఉగ్రవాదం, ఉక్రెయిన్ యుద్ధ వాతావరణం ఆశాంతి, జనహననం ప్రస్తావనతో మొదలై 'శ్మశాన కురుక్షేత్ర' దృశ్యంతో ముందుకు నడుస్తుంది. సైలెక్ట్ యాక్టింగ్, సంస్కృత నిష్ఠ, కన్నడ భాషా ప్రయోగంతో, లయబద్ధంగా నడుస్తుంది ప్రదర్శన. ధృతరాష్ట్రుడికి సంజయుడు యుద్ధక్షేత్ర దృశ్యాలను వివరించడాన్ని సంకేతిస్తూ, సమాచార సాధనం (రేడియో/ ఆకాశవాణి) పట్టుకొని ఉంటాడు. పిండి కొద్దీ రొట్టె అన్నట్లు ప్రొడక్షన్ రిచ్‌గా కాస్ట్యూమ్స్, సెట్ ప్రాపర్టీస్ ఖర్చుకు వెనకాడలేదని కళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఏ వస్తువునైనా రంగస్థలంపై సృజనాత్మక భావచైతన్యంతో కళారూపంలోకి అనువదించవచ్చునన్న 'ఆభాస' అడుగడుగునా కనిపిస్తుంది, ఈ నాటకంలో.

– ఆకుల మల్లేశ్వరరావు

'గ్రంథాలయం'పై కవితలకు ఆహ్వానం

మరో గ్రంథాలయోద్యమం ఇవాళ్ళి అవసరం. లీడ్ లైబ్రరీ ఆధ్వర్యాన అనేక గ్రామాల్లో లైబ్రరీలు ఏర్పాటు చేస్తున్నాం. ఇదే తరహాలో గ్రామగ్రామాన విజ్ఞాన భాండాగారాలు వెలిసేలా ప్రయత్నించడం అవసరం. సాంకేతిక వనరులు ఎన్ని వున్నా పుస్తకం పట్టుకొని చదివే అలవాటును తరాల విద్యార్థులలో, యువతలో ప్రోది చేయాలి. వారిని గ్రంథాలయాల వైపు నడిపించాలి. కనుక ఈ విషయమై స్పందించి, గ్రంథాలయం ఇతివృత్తంగా కవితలను పంపించవలసిందిగా కవులను ఆహ్వానిస్తున్నాం. 'జ్ఞానదీపం–గ్రంథాలయం' పేరుతో పాలపిట్ట బుక్స్ – లీడ్ లైబ్రరీ కలిసి ఒక కవితా సంకలనం ప్రచురించాలని సంకల్పించాం. కనుక కవితలను పంపించండి. వస్తు శిల్పాలలో నవ్యత పాటించే కవితలకే ప్రాధాన్యం. కవితలు పంపడానికి చివరి తేదీ మార్చి 30, 2023. మీ కవితలను palapitta-books@gmail.com లేదా kasula.ravikumar8@gmail.com కు ద్వారా పంపగలరు. వివరాలకు : 9490099327, 7981068048.

– కాసుల రవికుమార్, లీడ్ లైబ్రరీ

కథా పురస్కారానికి రచనల ఆహ్వానం

శ్రీమతి గంటా కమలమ్మ స్మారక కథా పురస్కారానికి గాను, రాయలసీమ కథకుల నుండి రచనలను ఆహ్వానిస్తున్నట్లు అవార్డు వ్యవస్థాపకులు గంటా మోహన్ తెలిపారు. ఈమేరకు, శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, 2021, 2022 సంవత్సరాల్లో ముద్రితమైన కథా సంపుటాలను మూడేసి ప్రతులను, గంటా మోహన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బంగారు పాలెం (పోస్టు, మండలం), చిత్తూరు జిల్లా అనే చిరునామాకు మార్చి 30 వ తేదీలోగా పంపాలని కోరారు. పురస్కార గ్రహీతకు పదివేల రూపాయలు నగదు, జ్ఞాపికతో సత్కరించనున్నట్లు తెలిపారు.

మార్చి 5న మధుశ్రీ కథాగౌరవ పురస్కారాలు

మార్చి 5వ తేదీ ఆదివారం ఉదయం 11.30 గంటలకు మధునాపంతుల ఫౌండేషన్ స్కూలు, పల్లిపాలెంలో జరిగే సభలో ప్రసిద్ధ కథకులు అనామకుడు, దాట్ల దేవదానం రాజు, ముక్కామల చక్రధర్‌లకు మధుశ్రీ కథా గౌరవ పురస్కారాలు అందజేస్తారు. గౌరవ పారితోషికం రూ.20 వేలు, రూ.10 వేలు నగదు, సత్కారం, జ్ఞాపిక అందిస్తారు. మధునాపంతుల సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగే సభలో డా. సీతారాం, అద్దేపల్లి ప్రభు, అవధానుల మణిబాబు పుస్తక సమీక్ష చేస్తారు.

కాలరేఖ

కవ్వించే కాలరేఖపై
మనిషి పరిగెడుతున్నాడు
జీవితం లోతైన ప్రాముఖ్యతను తప్పి చూడ్డానికి
తీరిక గుణంలేదు
ఒకరికొకరు చేతులు కూర్చుకుని
చుట్టూ తిరుగుతూ చేసే చోటీ నృత్యంలాంటి
చిన్న సరదాలు పుంజుకునే రోజుల్లేవు
ముందు దున్నిన వంకర చాళ్ళను సరిదిద్దే మడకలేదు
బతుకులో పసిపసిదని వాసన లేదు
మనిషి గురించి చెప్పేవాళ్లు లేరు
విలుకాండ్రున్నారు విల్లంబులున్నాయి
నేను పోరాడాలని చెప్పే గాయపు గుర్తులేవు
ఒక తూగు చప్పున మేల్కోవడం లేదు
విచ్చిన్న మవుతున్న కలలేవో యోచన లేదు

వర్ణించలేని దుఃఖం ఉంది
నేరం కుర్చీ నీడలో తప్పించుకునే దృశ్యాలున్నాయి
గుంజుకు కట్టిన గుండె ఉంది
మధ్యమధ్యలో పుట్టే తాత్కాలిక ప్రేమలున్నాయి
కొంతసేపు తగిలించుకుని తీసివేసే
మంచితనం మాస్కులున్నాయి
ఒక కోరికకు ఒక గతానికి మధ్య చిక్కుకుని
జీవితంలోని అన్ని దశల నుండి పారిపోవడముంది
తమ చీకటి గుహలో
సంపూర్ణ సౌకర్యవంతంగా ఉండడముంది
వనాల ప్రదేశిదిగా ఓ ముళ్లచెట్టుంది
ఏది వెనుకుందో అదేంగే ఉంది

ఈ వెలుగు సరిపోదు
ఈ చేతులు సరిపోవు
ఈ చికిత్స సరిపోదు
లోతైన విషాదం ఏదో రోజుల్ని దాటుతోంది
ఇన్ని ప్రణాళికల దారి చివరలో
గులకరాళ్ళ చప్పుడు ఆగలేదు
ఇది ప్రతిరోజూ రెక్కలు కత్తిరించే వాస్తవం
అలను అల నెట్టినట్లు
నొప్పిని నొప్పి నెడుతోంది
ఎక్కడా అద్దం దొరక్క
నిజం తనముఖాన్ని తాను చూసుకోలేదు
ఆ అద్దాన్ని చూపగలిగిన
అందర్ని కనిపెట్టుకునే,కన్నీళ్లు పెట్టుకునే
నిగూఢమైన నిజాయితీగల మనిషెక్కడ?

– శాంతయోగి యోగానంద
9107 70545


హాస్యానికి, వ్యంగ్యానికి పట్టాభిషేకం

పుస్తకం

ఆశ.. దోశ.. అప్పడం.. వడ అన్న మారుపేరుగల చంద్ర ప్రతాప్ కంతేటి [cp] గారు రాసిన, పుస్తకరూపంలో తెచ్చిన 'నవ్వుల పువ్వుల వెన్నెల హాసం'లో రచయిత పూర్వపు హాస్య బ్రహ్మలందరికీ వందనాలు చెప్పుకున్నారు త్యాగయ రీతిలో, అంత వినయంగానూ. బ్రహ్మలు వెళ్లిపోయారు. చంద్రప్రతాప్ గారిని నిస్సంకోచంగా, నిర్మొహమాటంగా హాస్య విష్ణు (విష్ణు బ్రహ్మకు బాబు) అనేసుకోవచ్చు. వాళ్ళందరి సరసన సమాన స్థాయిలో పీట వేసి అరిటాకులో శాకాహార భోజనం వడ్డించవచ్చు. ఆయనకు అన్ని అర్హతలూ వున్నాయి తెలుగు హాస్య పీఠం అధిరోహించడానికి. రెండు వందలకు పైగా హాస్య ఖండికలు రాశారు. అవిరామంగా ఇంకా ఇంకా రాసి మనం సోలిపోయేవరకు నవ్విస్తారు ఆ పనికి ఎవరో నియోగించినట్టు. చంద్రుడి మోహంలోనా వీరి మోహములోనూ ఆరని చిర్నవ్వులు ఉంటుంటుంది.

ఈ అర్బిఫ్ఫులో ఇరవై నాలుగు ఆణిముత్యాలలాంటి హాస్య ఖండికలున్నాయి. చదివి నవ్వనివాడిదే నేరం, పాపం. ట్రెండింగ్ వాక్కుల్ని పట్టెదైనా నవ్వు తీరాల్సిందే! కేవలం హాస్యానికే పట్టం కట్టారా? అలా కట్టుంటే 'సామాజిక స్పృహ మాటేమిటి' అని దాడి చెయ్యొచ్చు. సామాజిక స్పృహకి, అక్కడా అక్కడా నిస్పృహ వుంది.

ఈ వృత్తి రీత్యా పాత్రికేయుడు, రెండు మంచి పత్రికలకు సంపాదకుడిగా తరమా సింహం గుహలోకి వెళ్లి వచ్చిన సాహసి, పద్యోగాధ కవి, అనువాదకుడు, రచయిత ఇంతవరకు మనకు తెలియని న్యూస్ రూంలలో జరిగే వైపరీత్యాలను చెప్పి మన ముక్కుల మీద మనం చూపుడు వేళ్ళు వేసుకునేట్టు చేసి, గిలిగింతలు పెట్టారు. ఏ ఖండికలోనూ ఏమీ



దాచుకోకుండా నగ్నంగా చూపారు. నగ్నం సత్యానికి ప్రతీక. సౌందర్యానికి నగనాట్టాలా 'బాపీ' రేఖ చిత్రాలు తోడై కనువిందు చేస్తాయి. వ్యాసాలకు లేక కథనాలకు పెట్టిన ఇరవై నాలుగు పేర్లు అసలు విషయం జోలికి వెళ్లకుండా కూడా నవ్వింపచేస్తాయి. వాటిలో కొన్ని : గాడిదలు ఏసుగులైతే! వీళ్లకు కరోనా రాదు! కురుక్షేత్రంలో విసుగు శర్మ (రావి శాస్త్రి గారి వేతన శర్మలా), వత్తువాక్కు, నేను వచ్చిందాకా ఆగదా పాము?

ఈ హాస్య నలభీమపాకం నిండా జీడిపప్పులు, కిస్మిసులలా ఫన్ను, పన్ను [fun-lu, pun-lu]. చరకలకు కొదవే లేదు. హాస్యం, అపహాస్యం మధ్యనుండే విభజనరేఖను ఏ ముప్పూ వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తన మీదే తాను జోకులు వగిరాలు నిర్దయగా వేసుకున్నారు. కేడిందా మేలెంచమన్నారు పెద్దలు. కరోనా వల్ల వచ్చిన కీడుమూటికి గుడ్డకట్టి, మేలును ఎన్నారు. మరొక ఖండికలో కేసులు అక్షరాల కన్నా, అంత్య అక్షరాలు అక్షరాల సంఖ్యాపరంగా ఎక్కువ కదా [104] అని అమాయకులను నమ్మించే హాస్యానికి పాల్పడ్డారు. మనం తప్పనిసరిగా తప్పులు రాసే కొన్ని పదాలను ఎత్తి చూపి ఎగతాళి చేశారు. విలేకరులు 'విలేఖరులు' కావడాన్ని మందలించారు. టీవీ యాంకర్లతో చిరిగి పోయి 'వీళ్లకు కరోనా రాదా' అని ముద్దుగా శపించారు. 'మ.గ్రా. గారి మహాపురాణం' కాస్త కృతకంగా వుంది – ఏ మూడ్లో రాశారో. ఒక ఖండికలో ఒక పాత్ర అన్న ఈ పదాలు "పంతులు గారూ అప్పుడే హస్తప్రయోగం మొదలెట్టారా" డైలాగు నన్ను నవ్వించి చంపింది. వారి పేనాన్నగారి కథలో హాస్యం మోతాదు మించి వెగటు కలిగించేదేమోనన్నట్లు పాఠకుల కళ్లు చెమరింప చేశారు. ఈ పుస్తకం కేవలం చదివి, నవ్వి వదిలేసేది కాదు. దాచుకుని – కోపంగానో, విచారంగానో ఉన్న ప్రతిసారి పఠనీయం. (నవ్వుల పువ్వుల వెన్నెల హాసం – చంద్ర ప్రతాప్, పేజీలు 104, వెల రూ. 125. ప్రతులకు : 80081 43507)

– నవులూరి వెంకటేశ్వరరావు
99663 40014

'ఇ-సంజీవని'తో 10 కోట్ల మందికి ప్రయోజనం

- దేశభక్తి గీతాల పోటీ విజేత విజయ దుర్గకు అభినందనలు
- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ వైద్య సంప్రదింపులను సులభతరం చేసే 'ఇ-సంజీవని' యాప్ ద్వారా ఇప్పటి వరకు 10 కోట్లకుపైగా భారతీయులు ప్రయోజనం పొందినట్లు ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. భారత్ డిజిటల్ విప్లవ సామర్థ్యాన్ని ఈ యాప్ ప్రతిబింబిస్తోందన్నారు. ఆదివారం నిర్వహించిన 98వ 'మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన 'ఇ-సంజీవని' యాప్ ద్వారా అందుతున్న సేవలపై సిక్కింకు చెందిన ఓ వైద్యుడితో మాట్లాడారు. దేశానికి చెందిన యుపిఐ, సింగపూర్ 'పే నౌ' మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. భారతీయ కళలు, సంస్కృతి సంప్రదాయాలు, పండగలు, క్రీడల పాధాన్యత, వాటి పరిరక్షణకు పలువురు చేస్తున్న కృషిని ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. సర్దార్ వల్లాభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని దేశభక్తి గీతాలు, ముగ్గుల పోటీలు, లాలిపాటలపై దేశవ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో విజేతలను ప్రకటించారు. దేశభక్తి గీతాల పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టి విజయ దుర్గ విజేతగా నిలిచినట్లు తెలిపారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి స్ఫూర్తితో తెలుగులో ఆమె దేశభక్తి గీతాన్ని రచించినట్లు చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా 'పేరిణి ఒడిస్సీ' నృత్య ప్రదర్శనలు నిర్వహించిన రాజ్‌కుమార్ నాయక్ ప్రతిభను ప్రధాని ప్రశంసించారు. కాకతీయుల కాలంలో ఈ పేరిణి నాట్యం బాగా ప్రాచుర్యం పొందినట్లు గుర్తుచేశారు. 'స్వచ్ఛ భారత్' ఒక ఉద్యమంగా మారిందని చెబుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు అనుసరిస్తోన్న పరిశుభ్రత చర్యలను పేర్కొన్నారు. ప్రజలకు ప్రధాని మోడీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్‌'కు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

ఎన్‌రాన్ కుంభకోణం తలపిస్తోంది..

- అదానీ సంస్థలపై అమెరికా మాజీ ఆర్థికమంత్రి లారీ సమ్మర్స్

న్యూఢిల్లీ : హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత గౌతం అదానీ మునిగిపోవటమేగాక.. ఆయన కంపెనీలకు రుణాలు ఇచ్చిన సంస్థలూ దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్న ఈ అంశంపై అమెరికా మాజీ ఆర్థికమంత్రి లారీ సమ్మర్స్ స్పందించారు. అమెరికాలో 2001లో 'ఎన్‌రాన్ కుంభకోణం' బయటపడ్డాక.. ఎలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయో ఇప్పుడు భారత్‌లోనూ అదే సంభవించవచ్చునని అమెరికా మాజీ ఆర్థికమంత్రి లారీ సమ్మర్స్ అభిప్రాయపడ్డారు. కొద్ది రోజుల క్రితం 'వాల్‌స్ట్రీట్ వీక్‌'తో మాట్లాడుతూ, "భారత్‌లో ఎన్‌రాన్ తరహా పరిస్థితులు ఏర్పడొచ్చు. జీ-20 సమావేశాలకు నేతృత్వం వహిస్తున్న ఆ దేశం వైపు ఇప్పుడు అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు" అని వివరించారు. అమెరికాలో ప్రముఖ ఇంధన సంస్థల్లో ఒకటైన 'ఎన్‌రాన్ కార్పొరేషన్' 2001లో తన ఆదాయాలను పెంచి చూపింది. నష్టాలను దాచిపెట్టింది. ఈ విషయం బయటపడటంతో ఆ సంస్థ షేరు విలువలు భారీగా క్షీణించి.. దివాళా తీసింది.

గుజరాత్‌లో ఎస్ఈజెడ్

గౌతం అదానీ గ్రూప్ కంపెనీలపై ఓ వైపు తీవ్రస్థాయిలో ఆరోపణలు వస్తుంటే, అహ్మదాబాద్‌లో అత్యంత విలువైన భూమిని కట్టబెట్టడానికి గుజరాత్ ప్రభుత్వం సిద్ధమైంది. ఎస్ఇజెడ్, టౌన్‌షిప్ నిర్మాణం కోసం అదానీ గ్రూప్ 94వేల చదరపు మీటర్ల భూవి కావాలని ప్రభుత్వాన్ని కోరినట్టు ఆ రాష్ట్ర సిఎం భూపేంద్ర పటేల్ అసెంబ్లీలో ప్రకటించారు. ఇదిగాక, గాంధీనగర్‌కు సమీపంలోని జాస్పూర్ గ్రామంలో 202 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన వ్యవసాయేతర భూమిని ఇవ్వాలని అదానీ గ్రూప్ బిజెపి సర్కార్‌ను కోరింది. అహ్మదాబాద్‌కు సమీపంలో ఖోడియార్ గ్రామ పరిధిలో ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్)ని, జాస్పూర్‌లో టౌన్‌షిప్‌ను నిర్మిస్తామని అదానీ గ్రూప్ తెలిపింది.



డివైఎఫ్ఐ అఖిల భారత యువతుల సమ్మేళనానికి హాజరైన నేతలు, ప్రతినిధులు

ఉపాధి, సమాన హక్కుల కోసం పోరాటం

- ముగిసిన డివైఎఫ్ఐ యువతుల సమ్మేళనం
- కిసాన్ మజ్దూర్ ర్యాలీలో భాగస్వామ్యం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఉపాధి కోసం పోరాటం, సమాన హక్కుల కోసం పోరాటం' దేశవ్యాప్తంగా పోరాటం చేయాలని డివైఎఫ్ఐ అఖిల భారత యువతుల సమ్మేళనం పిలుపునిచ్చింది. ఢిల్లీలోని హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్ (హెచ్‌కెఎస్)లో రెండు రోజులపాటు జరిగిన డివైఎఫ్ఐ అఖిల భారత యువతుల సమ్మేళనం ఆదివారం ముగిసింది. 17 రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. మోడీ పాలనలో ప్రభుత్వం అనుసరిస్తున్న వివిధ మహిళా వ్యతిరేక విధానాల వల్ల మహిళల జీవితం మరింత కష్టతరంగా మారిందని సమావేశం తీర్మానించింది. బేటీ బచావో.. బేటీ పఢావో.. అని నినాదాలు ఇస్తున్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. దేశంలో నిరుద్యోగం అత్యధికంగా పెరుగుతోందని, లేబర్ మార్కెట్‌లో మహిళలు వివక్షకు గురవుతున్నారని పేర్కొంది. 2010 నుంచి 2020 మధ్య ప్రపంచబ్యాంకు చేసిన పరిశోధన ప్రకారం దేశంలో పనిచేసే మహిళల సంఖ్య 26 శాతం నుంచి 19 శాతానికి పడిపోయిందని, 2021లో గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్‌లో భారతదేశం 28 స్థానాలు పడిపోయిందని తెలిపింది. 156 దేశాల్లో భారతదేశం 140వ స్థానంలో ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో 'ఉపాధి కోసం పోరాటం, సమాన హక్కుల కోసం పోరాటం' అనే నినాదంతో ఉద్యమించాలని పిలుపునిచ్చింది. ఈ సదస్సును అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ప్రధాన కార్యదర్శి మరియం ధావలే ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు ఎఎ రహీం అధ్యక్షత వహించి సదస్సులో ప్రసంగించారు. డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి హిమఘ్నరాజ్ భట్టాచార్య సమావేశ నివేదికను సమర్పించారు. దాని ఆధారంగా చర్చలు జరిగాయి. చర్చలకు మీనాక్షి ముఖర్జీ సమాధానమిచ్చారు.

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, ఎంఎ బేబి ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. గ్రీష్మా అజయ్‌ఘోష్, చింతా జెరోమ్, ఎస్ భారతి, ధ్రువజ్యోతి సాహాతో కూడిన కన్వెన్షన్ ప్రిసిడియంకు మీనాక్షి ముఖర్జీ నాయకత్వం వహించారు.

బిజెపి ప్రభుత్వాలు సమాజంలో మనుస్మృతిని కొనసాగించడం, వరకట్నం వంటి పితృస్వామ్య నిబంధనల గురించి ఉత్తర భారత రాష్ట్రాల ప్రతినిధులు తమ ఆందోళనను పంచుకున్నారు. పనుల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న మహిళా వలస కూలీలు అక్కడ కూడా వేధింపులకు గురవుతున్నారని చర్చల్లో ప్రతినిధులు పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా, ప్రైవేటు రంగంతో సహా అన్ని రంగాల్లో ప్రసూతి సెలవులు, అన్ని ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం వంటి సంస్కరణలను కేరళలోని వామపక్ష ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా రుతుక్రమ సెలవులు కల్పించడం కోసం డివైఎఫ్ఐ బలమైన ఉద్యమాలు చేపడుతుందని తీర్మానించారు. స్వతంత్ర ప్రచారాలు, కార్యక్రమాలతోపాటు మహిళా అణచివేత, ఇతర సమస్యలపై ఉమ్మడి ఉద్యమాలు కూడా చేపట్టాలని నిర్ణయించారు. యువతుల హక్కుల కోసం పోరాడే క్రమంలో సంఘాన్ని కూడా బలోపేతం చేయాలని నిర్ణయించారు.

కిసాన్ మజ్దూర్ ర్యాలీలో భాగస్వామ్యం

ఫిబ్రవరి 25 సాయంత్రం జరిగిన డివైఎఫ్ఐ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఏప్రిల్ 5న జరిగే మజ్దూర్ కిసాన్ ర్యాలీలో డివైఎఫ్ఐ పాల్గొనాలని నిర్ణయించారు. దేశంలోని రైతులు, కార్మికులను ప్రభావితం చేసే సమస్యలు యువతకు కూడా సమానంగా ఉన్నాయని పేర్కొన్నారు.



కోహిమాలో ఈవిఎంలతో సిద్ధంగా ఉన్న వాహనాలు

ఈశాన్యంలో పోలింగ్ డే

- నేడు మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలు
- బరిలో 552 మంది.. 34 లక్షల మందికి పైగా ఓటర్లు
- 2న త్రిపురతోపాటు ఈ రెండు రాష్ట్రాల ఫలితాలు

షిల్లాం, కోహిమా : ఈశాన్య రాష్ట్రాలు మేఘాలయ, నాగాలాండ్‌లలో సోమవారం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రెండు రాష్ట్రాల్లో 60 చొప్పున ఉన్న అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. నాగలాండ్‌లో ఒక స్థానం ఏకగ్రీవమైంది. మేఘాలయలో ఒక స్థానంలో అభ్యర్థి మరణించారు. దీంతో ఈ రెండు రాష్ట్రాల్లో 59 చొప్పున అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం ఎన్నికల అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లనూ చేశారు. రెండు రాష్ట్రాల్లో పలు పార్టీల నుంచి మొత్తం 552 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. 34 లక్షల మందికి పైగా ఓటర్లు అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలను పూర్తి చేసుకున్న మరో ఈశాన్య రాష్ట్రంతో పాటు ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వచ్చే నెల 2న వెలువడనున్నాయి.

మేఘాలయలో 369 మంది అభ్యర్థులు


మేఘాలయలో ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. 21.4 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 10.8 లక్షల మంది మహిళలు ఉన్నారు. పలు ప్రధాన పార్టీలు, ఇండిపెండెంట్లు కలుపుకొని మొత్తం 369 మంది అభ్యర్థులు బరి ఉన్నారు. వీరిలో 36 మంది మహిళలు ఉన్నారు. ఎన్నికలు సాఫీగా సాగడానికి మేఘాలయలో భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీ సంఖ్యలో కేంద్ర బలగాలు మోహరించాయి. పోలింగ్ జరుగుతున్న 59 సీట్లలో బిజెపి, కాంగ్రెస్ తమ అభ్యర్థులను నిలిపాయి. అధికార ఎన్‌పిపి 57 మంది అభ్యర్థులను బరిలో ఉంచింది. టిఎంసి 36 మందిని పోటీలో పెట్టింది. 44 మంది ఇండిపెండెంట్లు బరిలో ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో మొత్తం 3482 పోలింగ్ స్టేషన్లలో దాదాపు 900 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మకమైనవిగా గుర్తించామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎఫ్ఆర్ ఖర్కోంగర్ చెప్పారు. బంగ్లాదేశ్‌తో అంతర్జాతీయ సరిహద్దును వచ్చేనెల 2 వరకు మూసివేయాలని ఆదేశించినట్టు తెలిపారు.

నాగాలాండ్‌లో 183 మంది అభ్యర్థులు

మరో ఈశాన్య రాష్ట్రం నాగాలాండ్‌లో 59 స్థానాలకు గానూ 183 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 13 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అధికార నేషనలిస్టు డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ), బిజెపి కూటమి 40:20 నిష్పత్తిలో తమ అభ్యర్థులను బరిలో నిలిపాయి. 2003 వరకు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్‌కు ప్రస్తుతం సభలో ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. ప్రస్తుతం ఆ పార్టీ 23 మంది అభ్యర్థులను పోటీలో పెట్టింది. 19 మంది ఇండిపెండెంట్లు పోటీ చేయనున్నారు.

భారత్‌లో డెన్మార్క్ యువరాజు పర్యటన

న్యూఢిల్లీ : డెన్మార్క్ యువరాజు ఫ్రెడెరిక్ ఆండ్రే హెన్రిక్ క్రిస్టియన్, యువరాణి మేరీ ఎలిజబెత్ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం భారత్‌కు చేరుకున్నారు. మార్చి 2 వరకు వారు భారత్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తారని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ పర్యటన డెన్మార్క్-భారత్‌కు మధ్య స్నేహబంధం, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి దోహదపడుతుందని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి ట్విట్టర్ వేదికగా తెలిపారు. రెండు దశాబ్దాల తర్వాత తొలిసారి డెన్మార్క్ రాచకుటుంబం భారత్‌లో పర్యటిస్తోందని పేర్కొన్నారు. దీనిలో యువరాజు వెంట ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి లార్స్ లోకీ రసముస్సేన్, పర్యావరణ శాఖ మంత్రి మాగ్నస్ హ్యూనిక్, ఇంధన శాఖ మంత్రి లార్స్ అగార్డ్ కూడా ఉన్నారు. 'ఈ పర్యటనలో వీరు తొలుత ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్‌తో భేటీ కానున్నారు. ఆ తర్వాత కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ నిర్వహించే 'ఇండియా-డెన్మార్క్: పార్ట్నర్స్ ఫర్ గ్రీన్ అండ్ సస్టైనబుల్ ప్రోగెస్' కార్యక్రమం ప్రారంభ సమావేశంలో పాల్గొంటారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోనూ సమావేశమవుతారు. ఆగ్రా, చెన్నైలో పర్యటించి.. మార్చి 2న తిరిగి డెన్మార్క్ బయలుదేరుతారు' అని విదేశాంగశాఖ అధికారులు తెలిపారు. గతేడాది మే నెలలో భారత ప్రధాని నరేంద్ర మోడీ డెన్మార్క్‌లో పర్యటించిన విషయం తెలిసిందే.



యువరాజు ఫ్రెడెరిక్ ఆండ్రే హెన్రిక్ క్రిస్టియన్,
యువరాణి మేరీ ఎలిజబెత్


పదేళ్లలో ఏం చేశారు?

- మాన్యువల్ స్కావెంజింగ్, మరణాలను నిరోధంపై కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- ఆరు వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ : మాన్యువల్ స్కావెంజింగ్‌కు, మరణాలకు ముగింపు పలకడానికి గత పదేళ్లలో ఏం చేశారని కేంద్రప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ ప్రశ్నకు ఆరు వారాల్లోగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. మాన్యువల్ స్కావెంజింగ్‌కు ముగింపు పలకాలని, అత్యవసర పరిస్థితుల్లో కూడా తగిన భద్రత లేకుండా మురుగు కాల్వల్లోకి ప్రవేశించే ఈ 'అమానవీయ పద్ధతి' నుంచి భవిష్యత్ తరాలను నిరోధించాలని పదేళ్ల క్రితమే ఇచ్చిన తీర్పును అమలు చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. డ్రై లెట్రిన్స్ (నిషేధం) చట్టం 1993, మాన్యువల్ స్కావెంజర్లుగా ఉపాధిని నిషేధించడం, వారి పునరావాస చట్టం 2013 ఉన్నా దేశంలో మాన్యువల్ స్కావెంజింగ్, మురుగు కాల్వల్లో చిక్కుకున్న వ్యక్తుల మరణాలు ఇప్పటికీ కొనసాగుతుండటంపై జస్టిస్ ఎస్. రవీంద్ర భట్ నేతృత్వంలోని ధర్మాసనం ఇటీవల జ్యూడీషియల్ నోటీసు తీసుకుంది. 2014లో సఫాయి కరంచారి ఆందోళన్, ఇతరులు వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో ఇచ్చిన తీర్పులో మాన్యువల్ స్కావెంజింగ్, మరణాలకు ముగింపు పలకాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మాన్యువల్ స్కావెంజర్లుగా పనిచేస్తున్న వ్యక్తులకు ఒకేసారి నగదు సహాయం చేయాలని, వారి కుటుంబాల్లో కనీసం ఒక సభ్యునికి జీవనోపాధి నైపుణ్యాల్లో శిక్షణ, రాయితీ రుణాలను అందించాలని కూడా పేర్కొంది. మురుగునీటి పారుదల పనుల్లో 1993 నుంచి మరణించిన వారిని గుర్తించి వారి కుటుంబాలకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ప్రతి మరణానికి రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కూడా ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2014లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అమలు కావడం లేదని డాక్టర్ బలరామ్ సింగ్ పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌ను విచారిస్తున్న జస్టిస్ భట్ నేతృత్వంలోని ధర్మాసనం 2014 తీర్పును అనుసరించి కేంద్రం తీసుకున్న చర్యల వివరాలను కోరింది. రాష్ట్రాల వారీగా డ్రై లెట్రిన్‌ల కూల్చివేతలు, కంటోన్మెంట్ బోర్డులు, రైల్వేల్లో సఫాయి కరంచారుల ఉపాధి వంటి ఇతర వివరాలను కూడా కోరింది. ఈ కేసులో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, ఎస్‌సి, ఎస్‌టిల జాతీయ కమిషన్లను ప్రతివాదులుగా కోర్టు చేర్చింది. న్యాయవాది కె.పరమేశ్వర్‌ను అమికస్ క్యూరీగా నియమించింది. కోర్టు ఆదేశం ప్రకారం కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆరు వారాల్లోగా తన నివేదికను సమర్పించాల్సి ఉంది.

మరీ బలహీనంగా భారత ఆర్థికం

- అధిక వడ్డీ రేట్లతో ప్రయివేటు మూలధన పెట్టుబడి మరింత కష్టతరం
- ఆర్‌బిఐ ఎంపిసి సభ్యులు జయంత్ వర్మ



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థపై ఆర్బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) సభ్యులు, అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ జయంత్ వర్మ ఆందోళన వ్యక్తం చేశారు. భారత ఆర్థిక వృద్ధి 'చాలా బలహీనంగా' ఉన్నట్టు కనిపిస్తున్నదని చెప్పారు. పెరుగుతున్న శ్రామిక శక్తి ఆకాంక్షలను తీర్చడానికి దేశానికి అవసరమైనదాని కంటే ఆర్థిక వృద్ధి తక్కువగా ఉండొచ్చని అన్నారు. పెరుగుతున్న ఈఎంఐ చెల్లింపులు గృహ బడ్జెట్‌లపై ఒత్తిడిని పెంచు తాయని తెలిపారు. ఎగుమతులు ప్రపంచంలో పలు అంశాల కారణంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆయన అన్నారు. అధిక వడ్డీ రేట్లు ప్రయివేటు మూలధన పెట్టుబడిని మరింత కష్టతరం చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక ఏకీకరణలో ఉన్నదనీ, దీంతో ఇటువైపు నుంచి ఆర్థిక వ్యవస్థకు మద్దతు తగ్గుతుందని వర్మ అన్నారు. ఈ అంశాల కారణంగా మన జనాభా సందర్భం, ఆదాయ స్థాయిని బట్టి పెరుగుతున్న మన శ్రామికశక్తి ఆకాంక్షలకు అనుగుణంగా దేశ ఆర్థిక వృద్ధి తక్కువగా ఉండవచ్చని తాను ఆందోళన చెందుతున్నానని ఆయన తెలిపారు.కరోనా మహమ్మారి, ఉక్రెయిన్ యుద్ధం నుంచి సరఫరా షాక్‌లు క్రమంగా ప్రపంచ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు రాబోయే నెలల్లో ప్రభావాన్ని చూపుతాయని అన్నారు. ప్రపంచం యుద్ధంతో జీవించడం నేర్చుకుంటున్నదనీ, అదే సమయంలో ద్రవ్య పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా వృద్ధిని ప్రమాదంలో పడేస్తున్నాయని ఆయన చెప్పారు. 2022-23 ద్వితీయార్థం అధిక ద్రవ్యోల్బణ సంవత్సరం అని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం (సిపిఐ) అంచనాను ఆర్‌బిఐ 6.7 శాతం నుంచి 6.5 శాతానికి తగ్గించిన విషయం తెలిసిందే. జనవరిలో భారత రిటైల్ ద్రవ్యోల్బణం 6.52 శాతంగా ఉన్నది. రిజర్వ్‌బ్యాంక్ స్వల్పకాలిక రుణ రేటును పెంచడంపై స్పందిస్తూ ఈ నేపథ్యంలో విరామం సరైనదని వర్మ అన్నారు. గతేడాది మే నుంచి స్వల్పకాలిక రుణ రేటును పెంచుతున్న రిజర్వ్ బ్యాంకు.. రెపో రేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. రెపో రేటు ఇప్పుడు 6.5 శాతంగా ఉన్నది. దేశ ఆర్థిక వ్యవస్థపై ఒకపక్క మోడీ సర్కారు గొప్పలు చెప్పుకుంటున్నది. 5 లక్షల డాలర్ల ఆర్థిక వ్యవస్థను తయారు చేస్తామని, ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో టాప్ 10లో ఉన్నామని ప్రచారాలు చేసుకుంటున్నది. అయితే, అదానీ వంటి బడా స్నేహితుల ప్రయోజనాలకు మోడీ సర్కారు ప్రాధాన్యతనిస్తున్నదని ఇప్పటికే పలువురు ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడ ఆర్బీఐ ఎంపీసీ సభ్యులు కూడా దేశ ఆర్థిక వృద్ధిపై ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం

వెనిజులా, బ్రెజిల్ మధ్య సహకారం మరింత ముందుకు : మదురో

కారాకస్ : బ్రెజిల్‌తో తమ దేశ సహకారం మరింత ముందుకు వెళుతుందని వెనిజులా అధ్యక్షులు నికోలస్ మదురో తెలిపారు. 'బ్రెజిల్-వెనిజులా మధ్య దౌత్య సంబంధాల పునరుద్ధరణకు మార్గం తెరిచి ఉంది. ఇరు దేశాల మధ్య సోదర భావం, సహకారంలో కొత్త దశను నేను ఆవిష్కరిస్తాను' అని మదురో ట్వీట్ చేశారు. బ్రెజిల్‌కు వెనిజులా రాయబారిగా మాన్యుయెల్ వాడెల్‌ను శుక్రవారం నియమించిన సందర్భంగా మదురో ఈ ట్వీట్ చేశారు. సంబంధాల పునరుద్ధరణలో భాగంగానే ఇరు దేశాల రాయబార కార్యాలయాలను పున:ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. 2019లో బోల్సోనారో అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి బ్రెజిల్-వెనిజులా మధ్య సంబంధాలు క్షీణిస్తూ వచ్చాయి. ఇటీవల బ్రెజిల్ అధ్యక్షుడిగా లూలా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడంతో, ఇరు దేశాల మధ్య సంబంధాలు బలపడుతున్నాయి.

సవాళ్లను అధిగమిస్తాం : ఖర్గే

రాయిపూర్ : కాంగ్రెస్ పార్టీ అనేక సవాళ్లను ఎదుర్కొంటుందని, వాటిని ఐక్యత, క్రమశిక్షణ, సంకల్పంతో అధిగమిస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. కాంగ్రెస్ పార్టీ 85వ ప్లీనరీ సమావేశాలు ముగిసాయని, ఇది నూతన కాంగ్రెస్ ఆవిష్కరణకు దిశానిర్దేశం చేసిందని ఆయన తెలిపారు. ఇక్కడ మూడు రోజుల పాటు జరిగిన ప్లినరీ సమావేశం ముగింపు సందర్భంగా ఆయన ఆదివారం ప్రసంగించారు. జాతీయ స్థాయిలో మన ప్రవర్తన పార్టీలో ప్రతిస్థాయిలో ఉన్న కోట్లాది మంది సహచరులపై ప్రభావం చూపుతుందని ఖర్గే చెప్పారు. కాలంతో పాటు అనేక విషయాలు మారతాయని, ప్రజల ఆకాంక్షలు, అంచనాలు మారతాయని, కొత్త సవాళ్లు పుట్టుకొస్తాయని, కొత్త మార్గాలు కూడా కనిపిస్తాయని అన్నారు.

ఛత్తీస్‌గఢ్ నాయకులపై కేంద్రం ఒత్తిడి : ప్రియాంక

విచారణ సంస్థలను ఉపయోగించి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ నాయకులపై ఒత్తిడి తీసుకుని వస్తుందని ప్రియాంక గాంధీ వాద్రా తెలిపారు. అక్రమ బొగ్గు లెవీ స్కామ్ ఆరోపణలతో రాష్ట్రంలో ఇటీవల ఇడి చేసిన దాడులు ఇందుకు ఉదాహరణ అని ఆమె అన్నారు. ఇటువంటి దాడులు ఛత్తీస్‌గఢ్ ప్రజలు, వారి హక్కులపై దాడిగా ఆమె పేర్కొన్నారు. 85వ ప్లీనరీ సమావేశాలు ముగింపు సందర్భంగా జోరా గ్రామంలో ఆదివారం నిర్వహించిన ర్యాలీలో ప్రియాంక ప్రసంగించారు.

నరేంద్ర మోడీ ప్రభుత్వం కేవలం పారిశ్రామిక వేత్తల మిత్రుల మాటలను వింటూ పేదల గొంతును విస్మరిస్తోందని విమర్శించారు. దేశంలో రైతులు రోజుకు రూ.27 సంపాదిస్తున్నారని, ప్రధానమంత్రి స్నేహితుడు రోజుకు రూ.1600 కోట్లు సంపాదిస్తున్నాడని అన్నారు. దేశంలో యువతకు ఉపాధి లేకుండా పోయిందని, కానీ విమానాశ్రయాలు, పోర్టులు, రైల్వేలు, పిఎస్‌యులను గౌతమ్ అదానికి అప్పగిస్తున్నారని ప్రియాంక విమర్శించారు. ర్యాలీ వేదిక ఉన్న మైదానం వద్దకు రాష్ట్రం నలుమూల నుంచి వేలాది మంది ప్రజలు హాజరయ్యారు.

జునైద్, నసీర్ హత్యలకు వ్యతిరేకంగా హర్యానా, రాజస్థాన్‌ల్లో నిరసనలు



న్యూఢిల్లీ : గోగూండాల చేతిలో జునైద్, నసీర్ దారుణ హత్యలకు వ్యతిరేకంగా హర్యానా, రాజస్థాన్ నలుమూలల నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. జునైద్, నసీర్‌లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నెల 24న హర్యానాలోని ఫిరోజ్‌పూర్ జిర్కా వద్ద వేలాది మంది ప్రదర్శన చేశారు. హర్యానా పోలీసులకు మెమోరాండం అందచేశారు. పోలీసులు సరైన చర్యలు తీసుకోకపోవడం, ప్రభుత్వ మద్దతు వంటి కారణాలతోనే ఇలాంటి హత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. కొన్నేళ్లుగా భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ గూండాలు ముస్లిములను లక్ష్యంగా చేసుకుని దాడులుకు దిగుతున్నారని విమర్శించారు. బస్సులు, టెంపోలపై జాతీయ జెండాలను ప్రదర్శిసూ.. 'జునైద్, నసీర్‌లకు న్యాయం చేయాలి' అని నినాదాలు చేశారు. గోగూండాలు చేసిన ఇతర హత్యలపైనా న్యాయ విచారణ జరిపించాలని, జునైద్, నసీర్ కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, ఇద్దరి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని మెమోరాండంలో డిమాండ్ చేశారు. గోగూండాలు అపహరించిన కారుపై విచారణ జరపాలని కోరారు. గోగూండాలు చేసిన ఇతర దాడుల్లోనూ ఈ కారును ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాజస్థాన్‌లోని ఘట్మీకలో నిరసనలు కొనసాగుతున్నాయి. మృతులు జునైద్, నసీర్‌ల స్వగ్రామమైన ఇక్కడ ఒక టెంటులో గత రెండు వారాల నుంచి శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. 'పార్లమెంట్‌లో మా స్వరం వినిపిస్తారని కాంగ్రెస్‌కు ఓటు వేశాం. కానీ వారు ఇప్పుడు ఏం చేస్తున్నారు? ఈ రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని నిశ్శబ్దంగా ఉండమంటుంది' అని గ్రామస్థులు విమర్శించారు. శాంతికి భంగం కలిగిస్తున్నారని ఆరోపిస్తూ రాజస్థాన్ పోలీసులు ఈ ఆందోళనలకు నోటీసులు ఇచ్చారు.రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇక్కడి ముస్లిం ముసాఫిర్ఖానా వెలుపల రాజస్థాన్ ముస్లిం ఫోరమ్ సభ్యులు, ఇతర సంఘాలకు చెందిన వ్యక్తులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అంబేద్కర్ రైట్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దశరథ్ హినునిమా కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కూడా కొన్ని విద్యార్థి సంఘాలు నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి.



మీకోసం

కూరల్లో, పులుసుల్లో, ఉప్పు, కారం ఎక్కువైనప్పుడు రెండు చెంచాలు వేయించిన శనగపిండిని కలిపితే కూర రుచికరంగా ఉంటుంది.

జీవన సౌరభం

ప్రశ్నించనిదే సమాధానం దొరకదు.
ప్రయత్నించనిదే విజయమూ దక్కదు.

నాగరికత సోపానం



శాస్త్ర విజ్ఞానం
నాగరికత సోపానం
జీవన నేస్తం
అభివృద్ధికి మూలం

శాస్త్ర విజ్ఞానం
తొలగించు అజ్ఞానం
వెలిగించు జ్ఞానం
చేర్చును గమ్యం

శాస్త్ర విజ్ఞానం
సౌకర్యాల సౌధం
మూఢనమ్మకాలు దూరం
మెరుగైన జీవనం

శాస్త్ర విజ్ఞానం
నిరంతర ప్రయాణం

తార్కిక జ్ఞానం
సాఫల్యతా సిద్ధాంతం

శాస్త్ర విజ్ఞానం
శోధనతో సాధ్యం
శాస్త్రీయ దృక్పథం
జీవన ఆనందం

శాస్త్ర విజ్ఞానం
ఆవిష్కరణల జగం
ఆలోచనలకు జీవం
జీవన శైలి మార్చే ప్రయత్నం

శాస్త్ర విజ్ఞానం
అశాంతిని రగిలించే
విధ్వంసకారుల చేతిలో
కారాదు ఆయుధం

శాస్త్ర విజ్ఞానం
దుర్వినియోగం కాకుండా
ప్రపంచ శాంతిని పరిరక్షించాలి
మానవాళికి ఆనందం పంచాలి

- మొర్రి గోపి
88978 82202





తేడాలు గుర్తించండి

పిల్లలూ!
ఈ చిత్రంలో
ఐదు తేడాలు ఉన్నాయి.
అవి ఏంటో గుర్తించండి.



నేను గీసిన బొమ్మ



ఉప్పాడ లిఖిత,
3వ తరగతి,
ప్రాథమిక పాఠశాల,
రైల్వే న్యూ కాలనీ,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సముద్రమంత దు:ఖాన్ని దిగమింగి..





కరిబీరన్ పరమేశ్వరన్ రోజూ ఉదయమే సముద్రపు ఒడ్డుకు వెళ్లడం అలవాటు. ఆ రోజు తన ముగ్గురు పిల్లలను, వాళ్లింటికి వచ్చిన బంధువులను తీసుకెళ్లాడు. అలలతో కేరింతలు కొడుతూ ఆడుతున్న పిల్లలను చూసి మురిసిపోతున్న ఆ క్షణం అనుకోని ఉపద్రవంలా ఆకాశమంత ఎత్తులో ఎగిసిపడుతున్న అల అల్లంత దూరాన కనిపించింది. అది చూసిన అతని ఐదేళ్ల కొడుకు తండ్రి వద్దకు అమాంతం పరుగెత్తుకు వచ్చాడు. అతని చెయ్యి పట్టుకుని దూరంగా పరుగెత్తుతూ తన ఇద్దరు పిల్లల జాడ గురించి ఆరా తీయాలనుకుని వెనక్కిచూశాడు కరిబీరన్. అయితే అతని చూపు పిల్లల వరకు చేరకుండానే ఆ రాకాసి అల ఆ తండ్రీకొడుకులను ఈడ్చుకుపోయింది. కొడుకు చెయ్యి తన నుండి విడిపోవడం కరిబీరన్‌కు ఇప్పటికీ గుర్తే.. నీళ్లల్లో కొట్టుకుపోతున్న కరిబీరన్ ఓ చెట్టు కొమ్మను గట్టిగా పట్టుకుని ప్రమాదం నుండి బయటపడ్డాడు. 'కొంతసేపటి తరువాత కళ్లు తెరిచిన నేను బిడ్డల కోసం బీచ్ ఒడ్డుకు పరుగెత్తాను. అప్పుడే నా పెద్ద కూతురు నీటి ప్రవాహంలో తేలుతూ వెళ్లడం కనిపించింది. ఆమె అప్పటికే మృతిచెందింది. అక్కడికి కొద్ది దూరంలోనే నా కొడుకు శవం కనిపించింది. అలా నా ముగ్గురు బిడ్డలతో పాటు మా గ్రామంలో ఆ రోజు 6000 మంది ప్రాణాలు కోల్పోయారు' అని చెబుతున్నప్పుడు కరిబీరన్ కళ్లు నీటి చెలమలయ్యాయి. తమిళనాడు నాగాపట్నం సముద్ర సమీప గ్రామంలో జరిగిన ఆ దుర్ఘటనలో (2004 డిసెంబరు 26న సంభవించిన సునామీ ఘటనలో) ఆప్తులను, కన్న బిడ్డలను, తల్లిదండ్రులను కోల్పోయిన ఎంతోమంది అభాగ్యుల్లో కరిబీరన్ కుటుంబం ఒకటి. విషాదరకరమైన విషయమేమంటే ఆ రోజే అతని పుట్టినరోజు.. ఆ దుర్ఘటన జరిగిన నాటి నుండి అతను పుట్టినరోజును జరుపుకోవడం లేదు.

'ఆ రోజు ఆదివారం కావడం వల్ల బీచ్ అంతా పిల్లలు, పెద్దలతో నిండిపోయింది. సునామీ అలలతో క్షణకాలంలో అంతా ఖాళీ అయిపోయింది. గ్రామమంతా శోకసంద్రంలో ఉన్న ఆ వేళ సాయమందించే వారే కనిపించలేదు. ప్రాణం లేని నా బిడ్డలను ఓ తోపుడుబండిపై వేసుకుని ఇంటికి చేరాను. కళ్లల్లో నీరు కాల్వలై కారుతుండగానే నేను నా భార్య స్వయంగా వారిని ఖననం చేశాం. మూడు రోజులపాటు నా భార్య చూడామణి మాటా పలుకు లేకుండా ఉండిపోయింది. ఆ నిశ్శబ్దాన్ని భరించలేక నాలుగోరోజు నేను ఆమె దగ్గరికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పాను. అప్పుడు ఆమె 'మన జీవితం మన చేతుల్లో లేదు. ఆత్మహత్య చేసుకోవడానికి నేను ఒప్పుకోను. ముందు మన గ్రామ పరిస్థితి చూద్దాం పద' అంటూ నన్ను ఊళ్లోకి తీసుకెళ్లింది. మొదట మేము గ్రామంలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి వెళ్లాం. అక్కడ తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన నలుగురు పిల్లలు కనిపించారు. ఆ క్షణమే మా కర్తవ్యం అర్థమైంది. వారిని మాతోపాటు మా ఇంటికి తీసుకొచ్చాం' అని చెబుతున్న పరమేశ్వరన్ ఆ తరువాత భార్య సహకారంతో తన ఇంటినే ఓ అనాథశరణాలయంగా మార్చేశారు.

'నంబిక్కి' (తమిళంలో దానర్థం నమ్మకం) పేరుతో నిర్వహిస్తున్న ఆ శరణాలయంలో చేరిన 30 మందికి పైగా పిల్లలకు పరమేశ్వరన్, చూడామణి అమ్మానాన్నగా మారారు. ఒకప్పుడు మా కాంపౌండు దాటి లోనికి ప్రవేశించిన చుట్టుపక్కల మత్స్యవాడ పిల్లలను బాగా తిట్టేవాడిని. కాని ఇప్పుడు వారిని చేరదీశాను. చదువు చెప్పిస్తున్నాను. ఆడ, మగ పిల్లలకు వేర్వేరుగా వసతి ఏర్పాటు చేశాను. ఇక్కడి నుండే ఈ పిల్లలు స్కూలుకు వెళతారు. ట్యూషను టీచర్లను నియమించాను. ఇక్కడ ఉండి చదువుకున్న పిల్లలు ఇప్పుడు ఉన్నత విద్య కోసం విదేశాలకు కూడా వెళుతున్నారు. నా బిడ్డలే ఉంటే ఓ తండ్రిగా ఇంతకంటే ఏం చేయగలను' అంటున్న పరమేశ్వరన్ స్నేహితుల నుండి వచ్చిన నిధులతో ప్రభుత్వ సహకారంతో ఈ శరణాలయాన్ని నిర్వహిస్తున్నారు.

'ఈ 18 సంవత్సరాలుగా చనిపోయిన నా ముగ్గురు బిడ్డలను జ్ఞాపకం చేసుకోని రోజు లేదు. ఆ జ్ఞాపకాలే ఈ పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వడంలో మమ్మల్ని ముందుకు నెడుతున్నాయి. ఈ పిల్లలతో పాటే నా సొంత బిడ్డలు ఇద్దరూ ఇక్కడే వీరితో పాటే చదువుకుంటారు. ఆడుకుంటారు. మా తదనంతరం ఈ సంస్థ బాధ్యతలు వారే నిర్వహిస్తామని మాకు మాట ఇచ్చారు' అని చెబుతున్నప్పుడు పరమేశ్వరన్ మాటలు దు:ఖంతో తడబడ్డాయి.

ఇరవై సంవత్సరాలు సమీపిస్తున్నా.. సునామీ మిగిల్చిన పెను విషాదానికి బలైన ఎన్నో కుటుంబాలు నేటికీ నిర్జీవంగా బతుకులు వెల్లదీస్తున్నాయి. కరిబీరన్ కుటుంబం లాంటి ఒకరో.. ఇద్దరో.. విషాదం తాలూకు గాయాలను నెమరువేసుకుంటూనే అభాగ్యులకు అండగా నిలబడుతున్నారు.

ఉల్లి ఎంతో మేలు..



ఉల్లి పాయల్లో ఎన్నో ఔషధ గుణాలున్నాయని చాలామందికి తెలుసు. అవేంటో ఒకసారి పరిశీలించండి. ఉల్లిలో ఉండే విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు జలుబు, జ్వరంతో పోరాడటానికి సహాయపడతాయి. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో కూడా ఉల్లిపాయలు సహాయపడతాయి.

ఉల్లిపాయల్లోనే కాదు.. ఉల్లి కాడల్లో కూడా ఔషధగుణాలు మెండు.

- ఉల్లిపాయలను ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తపోటు, ఆస్టియోపోరోసిస్ వంటి ఎముక సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు తగ్గుతాయి.
- ఉల్లిపాయ కాడల్లో ఉండే ఫోలేట్స్ గుండె జబ్బులను అదుపులో ఉంచుతాయి. అలాగే కెమోఫెరోల్ అనే ఫ్లేవనాయిడ్ రక్తనాళాలపై ఒత్తిడి లేకుండా రక్త ప్రవాహాన్ని సాఫీగా సాగేలా చేస్తుంది.
- తక్కువ క్యాలరీలు, కొవ్వు పదార్థాలు, పీచుపదార్థాలు ఎక్కువగా ఉండే ఉల్లిపాయలను రోజూ తినేవారికి అధిక బరువు సమస్యలుండవు.
- ఉల్లిపాయల్లో ఉండే జియాంథిన్ అనే పదార్థం కంటి చూపును మెరుగుపరుస్తుంది.
- ఉల్లిపాయలు చర్మాన్ని హానికరమైన కిరణాల నుండి రక్షిస్తాయి.
- గర్భం దాల్చిన మొదటి మూడు నెలల్లో వీటిని తరచుగా తినడం వల్ల కడుపులో బిడ్డకు ఫోలిక్ యాసిడ్ అందుతుంది.
- ఉల్లిపాయలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. కాలేయం చుట్టూ ఉండే అధిక కొవ్వును తగ్గిస్తుంది.
- ఇందులో అధిక మోతాదులో ఉండే సల్ఫర్ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది.
- ఉల్లిపాయల్లో విటమిన్ సి, విటమిన్ బి2, థయామిన్ పుష్కలంగా ఉన్నాయి. విటమిన్ ఎ, విటమిన్ కె కూడా ఉన్నాయి.
- ఇంకా కాపర్, ఫాస్పరస్, మెగ్నీషియం, పొటాషియం, క్రోమియం, మాంగనీస్, ఫైబర్ కూడా ఉన్నాయి.

పెద్ద తరం హీరోలు నవతరం హీరోయిన్లు





ఒక జంటను చూడగానే ఈడుజోడు ఎంత బాగుందో అనుకుంటాం. అదే మాదిరిగా సినిమాల్లోనూ హీరోహీరోయిన్లు కనిపిస్తే ఆ సినిమా బాగుంటుంది. ఆ జంటకు వయస్సుకు తగ్గ మాటలు దొరుకుతాయి. సీన్లూ, పరిస్థితులు కల్పించవొచ్చు. వీరి కాంబినేషన్ తెర మీద మళ్లీ మళ్లీ వస్తే ఎంత బాగుంటుందో అనిపించాలి. కానీ ఇప్పుడు తీస్తున్న పెద్ద హీరోలకు చిన్న వయస్సు హీరోయిన్లను ఎంపిక చేస్తున్నారు దర్శక నిర్మాతలు. హీరోహీరోయిన్ల మధ్య సీన్లు వచ్చినప్పుడు ఆ వయస్సు తారతమ్యం స్పష్టంగా కనిపిస్తోంది. దాంతో వారి మధ్య చెప్పుకోతగ్గ కథ నడవదు. ఎమోషనల్ ఉండదు. వీరి మధ్య ప్రేక్షకులు ఆశించినంత వినోదం పండించలేరు. సినిమా విఫలమయ్యే కారణాల్లో ఈ అంశం కూడా ఒకటి.

తెలుగులో వచ్చిన చాలా సినిమాల్లోనూ హీరో పాత్రకు ఉన్న ప్రాధాన్యత హీరోయిన్‌కు ఇవ్వరు. అందుకే పెద్ద హీరో పక్కన చిన్న వయస్సు హీరోయిన్ నటింప చేయడం ఏంటి? అని చర్చ చేయరు. పెద్ద హీరోకు సరైన జోడీ కోసం చేసే ప్రయత్నంలో ఇండస్ట్రీలో సీనియర్ హీరోయిన్లు ఉన్నారు. కాని వారికి వయస్సు అయిపోయిందని, లావుగా ఉన్నారని, గ్లామర్స్‌గా కనిపించరని, పెళ్లి అయిపోయిందని, సరైన సమయం కేటాయించలేరని సమాధానపడిపోతున్నారు. దాంతో చిన్న వయస్సు హీరోయిన్‌కు అవకాశం ఇస్తున్నారు మేకర్స్. దాంతో ఈ జంటను తెరమీద చూడటానికి అభిమానులకు, ప్రేక్షకులకు ఇబ్బందికరంగా ఉంటుంది.

సంక్రాంతికి విడుదలైన మెగాస్టార్ చిరంజీవి చిత్రం 'వాల్తేరు వీరయ్య'లో శృతిహాసన్ హీరోయిన్‌గా నటించింది. ఆమె యువ హీరోయిన్. మెగా ఫ్యామిలీ హీరోల పక్కన కూడా జంటగా నటించింది. ఒక రకంగా చెప్పాలంటే కూతరు వయస్సు ఉన్న ఆమె. దాంతో ఈ జంటను చూసేందుకు అభిమానులు తెరమీద కాస్త ఇబ్బందికరంగా ఫీలయ్యారు. కథ అంతా కామెడీ, సీరియస్ కోణంలో నడవడంతో ఈ మైనస్ పెద్దగా చర్చకు రాలేదు. ఇప్పుడు మెగాస్టార్ కొత్తగా నటిస్తున్న కొత్త చిత్రం 'బోళా శంకర్'. ఇందులో తమన్నా హీరోయిన్‌గా నటిస్తుంది. ఈమె కూడా చరణ్, బన్నీల పక్కన నటించింది. పాత సినిమాల్లోనూ రామారావు, నాగేశ్వరరావు పక్కన చిన్న వయస్సు హీరోయిన్ అయిన శ్రీదేవి నటించడం అప్పట్లో పెద్ద చర్చ అయింది. అప్పట్లో ఆ హీరో తగ్గ హీరోయిన్‌గా వయస్సు తగ్గ కథానాయకురాలిగా మేకప్‌తో మార్చారు. కథలోనూ ఆ పాత్రకు తగ్గ ప్రాధాన్యత కల్పించారు.కాని ఇప్పుడు కేవలం పెద్ద హీరో పక్కన డ్యాన్స్ చేయడానికే యువ హీరోయిన్‌ను తీసుకుంటున్నారు.



బాలకృష్ణ నటించిన ' వీర సింహారెడ్డి ' చిత్రంలో తల్లి పాత్రలో యువ నటి హనీ రోజ్‌ను చూపించారు. ఆమె కొడుకుగా బాలకృష్ణ కనిపించారు. తల్లి–కొడుకు మధ్య వచ్చే సీన్లలో వయస్సు స్పష్టంగా కనిపించింది. తెర మీద ఇటువంటి సీన్లు నవ్వుకునేందుకే అన్నట్లుగా ఉన్నాయి. ఇప్పుడు అగ్రహీరోల్లో ఒకరైన నాగార్జున రచయిత ప్రసన్న కుమార్ చెప్పిన కథ నచ్చి కొత్త చిత్రం నటించబోతున్నారు. అందులో మాజీ మిస్ ఇండియా మానస వారణాసిని ఖరారు చేస్తున్నారు. ఈమెను ఈ చిత్రం ద్వారా ఇంద్రస్ట్రీకి పరిచయం చేస్తున్నారు. వయస్సులో హీరో కన్నా చాలా చిన్నది. అయినా మిస్ ఇండియా కావడంతో అవకాశం ఇచ్చారు. తెర మీద వీరి జంట ఎలాగుంటుందో చూడాలి. క్రిస్మస్ కానుకగా విడుదలైన రవితేజ 'ధమాకా' చిత్రంలోనూ హీరోయిన్‌గా కొత్త నటి శ్రీలీల నటించింది. ఈమెది రెండో చిత్రం. డ్యాన్స్ అద్భుతంగా చేస్తుంది. అందుకే మేకర్స్ ఆమె కన్నా చాలా పెద్ద అయిన రవితేజ పక్కన నటింపచేశారు. ఈ సినిమాలో రవితేజ ముఖం ముడతలుగా, భీకరంగా కనిపించింది. అతని పక్కన శ్రీలీల ఓ చెల్లిలా, కూతురులా కనిపించింది. ఎటువంటి జాగ్రత్తలూ తీసుకోలేదు. కథ పరంగానూ సినిమా పెద్దగా హిట్ అవ్వలేదు. ఎన్ని అనుభవాలు ఇండస్ట్రీలో ఎదురవుతున్నా ఇంకా పాత తరహా ఆలోచనలు చేస్తున్నారు మేకర్స్. కాని ఇప్పుడు జనరేషన్ మారింది. ప్రేక్షకులు అన్ని కోణాల్లో నుంచి సినిమాను చూస్తున్నారు. కాబట్టి హీరోకు తగ్గ హీరోయిన్‌ను అవకాశం కల్పించాలి. ఆమె పాత్ర కీలకంగా ఉండాలి. అప్పుడే సినిమా విజయవంతమవుతుంది.

మన కథానాయకులు జీవితాంతం వీరోచితంగా సినిమాల్లో నటిస్తూ ఉంటారు. వయసుకు తగిన పాత్రలు కాక కుర్ర పాత్రల్లో కనిపించటానికి తాపత్రయపడతారు. కథానాయికల దగ్గరకు వచ్చేసరికి ఈ సీను పూర్తిగా రివర్సు. వారు అక్క, అమ్మ, అమ్మమ్మ పాత్రల్లోకి చూస్తుండగానే జారుకుంటారు. అనుభవం ఉన్న తారలు అందుబాట్లో ఉన్నా వారిని మన నిర్మాతలు హీరోయిన్లుగా తీసుకోరు. హీరోయిన్ల పాత్రలను కేవలం గ్లామర్ డాల్స్‌గా చూపటం వల్లే ఈ పరిస్థితి! భవిష్యత్తులో వస్తున్న సినిమాల్లో ఇటువంటి జాగ్రత్తలు చాలా అవసరం కూడా.

ఆసీస్ సిక్సర్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ సొంతం
ఫైనల్లో దక్షిణాఫ్రికాకు భంగపాటు



కేప్‌టౌన్ : ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో అందరూ ఊహించిన జట్టునే విజయం వరించింది. ఆతిథ్య దక్షిణాఫ్రికా మహిళలు దేశ క్రికెట్ చరిత్రలో నవ శకానికి నాంది పలికేందుకు టైటిల్ పోరులో పోరాడినా.. చివరకు భంగపాటు తప్పలేదు. టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా 19 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. రికార్డు స్థాయిలో ఆరోసారి పొట్టి ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. బెత్ మూనీ (74 నాటౌట్, 53 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులతో తొలుత ఆస్ట్రేలియా 156/6 పరుగులు చేసింది. ఛేదనలో దక్షిణాఫ్రికా ఓపెనర్ లారా (61, 48 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) కదం తొక్కినా సఫారీలు 20 ఓవర్లలో 7 వికెట్లకు 137 పరుగులే చేశారు. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో తొలిసారి ఫైనల్లో పోటీపడిన దక్షిణాఫ్రికా అమ్మాయిలు సొంత అభిమానుల నడుమ కల చెదరటంతో కన్నీటి పర్యంతమయ్యారు. బెత్ మూనీ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది.

లారా పోరాడినా : ప్రపంచకప్ ఫైనల్లో 157 పరుగుల లక్ష్యం పెద్దదే. కానీ ఓపెనర్ లారా (61) అర్ధ సెంచరీతో సఫారీ ఛేదనలో దూసుకెళ్లింది. ఆమెకు సహచర బ్యాటర్ల నుంచి సహకారం దక్కలేదు. ఓ ఎండ్‌లో లారా దంచికొట్టినా.. మరో ఎండ్‌లో కట్టడి చేసిన కంగారూ బౌలర్లు.. అంతిమంగా ఒత్తిడి పెంచగలిగారు. బ్రిట్స్ (10), మరిజానె (11), సునె లుస్ (2), నదినె (8 నాటౌట్), బాచ్ (1) విఫలమయ్యారు. లారా నిష్క్రమణతో సఫారీ ఛేదనలో పస తగ్గింది. 137 పరుగులే చేసిన దక్షిణాఫ్రికా 19 పరుగుల తేడాతో ప్రపంచకప్ టైటిల్‌ను చేజార్చుకుంది.

మూనీ మెరుపుల్ : తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియాకు ఓపెనర్ బెత్ మూనీ (74 నాటౌట్) మెరుపు ఆరంభాన్ని అందించింది. అలీసా హీలే (18)తో కలిసి తొలి వికెట్‌కు 36 పరుగులు జోడించిన మూనీ.. చివరి వరకు క్రీజులో నిలిచింది. 9 ఫోర్లు, ఓ సిక్సర్‌తో ధనాధన్ మోత మోగించింది. మిడిల్ ఆర్డర్‌ను కట్టడి చేసిన సఫారీ బౌలర్లు ఆసీస్ భారీ స్కోరు చేయకుండా నిలువరించారు. గార్డ్‌నర్ (29) మరోసారి ఆకట్టుకుంది. హారిస్ (10), మెగ్ లానింగ్ (10), పెర్రీ (7)లు స్వల్ప స్కోర్లకే వికెట్ పారేసుకున్నారు. సఫారీ బౌలర్లలో షబ్నిం, మరిజానె రెండేసి వికెట్లు పడగొట్టారు. మూనీ మెరుపులతో ఆసీస్ తొలుత 156 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా మహిళలు : 156/6 (బెత్ మూనీ 74, గార్డ్‌నర్ 29, షబ్నిం 2/26, మరిజానె 2/35)

దక్షిణాఫ్రికా మహిళలు : 137/6 (లారా 61, ట్రయాన్ 25, స్కాట్ 1/23, జొనాసెన్ 1/21)

సర్వ హక్కులూ మాకే!



- భారత్‌లో హ్యాండ్‌బాల్‌పై హెచ్‌ఏఐ అధ్యక్షుడు జగన్
- అంతర్జాతీయ, ఆసియా సమాఖ్యల గుర్తింపు
- త్వరలోనే ఐఓఏ నుంచీ సానుకూల స్పందన

హైదరాబాద్ : జాతీయ హ్యాండ్‌బాల్‌లో గత కొంతకాలంగా చోటుచేసుకున్న సందిగ్ధత, రాజకీయాలు, కుట్రలకు శాశ్వతంగా ముగింపు పలికామని భారత హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్‌ఏఐ) అర్శనపల్లి జగన్‌మోహన్ రావు తెలిపారు. అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ సమాఖ్య, ఆసియా హ్యాండ్‌బాల్ సమాఖ్యలు హెచ్‌ఏఐకు భారత్‌లో జాతీయ క్రీడా సమాఖ్య గుర్తింపు అందించాయని, ఇక్కడ హ్యాండ్‌బాల్ నిర్వహణ, అభివృద్ధిపై సర్వ హక్కులూ హెచ్‌ఏఐ సొంతమని జగన్‌మోహన్ రావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ మేరకు అంతర్జాతీయ, ఆసియా హ్యాండ్‌బాల్ సమాఖ్యలు భారత ఒలింపిక్ సంఘానికి పంపిన లేఖల ప్రతులను చూపించారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (హెచ్‌ఏఐ) కాకుండా.. మరే ఇతర సంఘం హ్యాండ్‌బాల్‌లో జోక్యం చేసుకున్నా తక్షణమే భారత్‌లో హ్యాండ్‌బాల్‌పై నిషేధం విధిస్తామని అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ సమాఖ్య ఇటీవల ఐఓఏకు రాసిన లేఖను సైతం జగన్‌మోహన్ రావు విలేకరుల సమావేశంలో బయటపెట్టారు. 'ఎటువంటి సిఫారసులకు తలొగ్గకుండా ఉత్తమ జట్లను ఎంపిక చేశాం. హిమాచల్ ప్రదేశ్‌లో ఆధునాతన అకాడమీలో శిక్షణ అందించాం. ఫలితంగా, 2022 ఆసియా జూనియర్ మహిళల యూత్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌తో పాటు అదే ఏడాది ఆసియా మహిళల యూత్ బీచ్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచాం. 2023 ఆసియా మహిళల ప్రెసిడెంట్ కప్ విజయంతో సరికొత్త చరిత్ర సృష్టించాం. 2023 ఆసియా క్రీడలకు భారత మహిళల జట్టు అర్హత సాధించింది. దక్షిణాది, ఓ తెలుగు రాష్ట్రానికి చెందిన వ్యక్తి జాతీయ సమాఖ్య అధ్యక్ష పగ్గాలు చేపట్టడం కొందరికి నచ్చలేదు. అధ్యక్ష పీఠం నుంచి తొలగించేందుకు కుట్ర చేశారు. ఇంత చేసినా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చాం. దేశంలో హ్యాండ్‌బాల్ కార్యకలాపాలను హెచ్‌ఏఐ మాత్రమే నిర్వహించేలా భారత ఒలింపిక్ సంఘానికి అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ సమాఖ్య లేఖ రాసింది. అడ్డంకులు సృష్టిస్తున్న సంఘాలు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో త్వరలోనే హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి హ్యాండ్‌బాల్ అకాడమీ ఏర్పాటు చేస్తామని' జగన్ వెల్లడించారు.

రెండు మెగా టోర్నీలు : 'ఈ ఏడాది రెండు మెగా టోర్నీలు నిర్వహిస్తున్నాం. ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ తొలి సీజన్ పోటీలను జూన్‌లో నిర్వహించనున్నాం. జూన్ 8 నుంచి 25 వరకు ఈ పోటీలు జరుగుతాయి. జులైలో ఆసియా మహిళల యూత్ చాంపియన్‌షిప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాం. న్యూఢిల్లీ వేదికగా జులై 15 నుంచి 24 వరకు ఈ టోర్నీ ఉంటుంది. జపాన్, చైనా, చైనీస్ తైపీ, ఇరాన్ సహా పది దేశాలు ఈ టోర్నీలో పోటీపడనున్నాయి. గత ఏడాది హైదరాబాద్ వేదికగా ఆసియా మెన్స్ క్లబ్ చాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహించటంతో ఆసియా యూత్ టోర్నీ ఆతిథ్య హక్కులు దక్కాయని' అని జగన్ అన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68